మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 20 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



## చిత్రపురి కేసులో నిజాలు బయటపెట్టాలి: ఆర్ఎస్పీ



హైదరాబాద్, మార్చి 21 (ప్రజా మంటలు): చిత్రపురి సిటీలో రూ. 3 వేల కోట్ల భూదందా జరిగిందని ఆరోపణ వస్తే ఆధారాలతో స్పందించాల్సింది పోయి దౌర్జన్యంగా అక్రమ కేసు పెట్టి, సెల్‌ఫోన్‌ను సీజ్ చేయడం ఏంటి రేవంత్ రెడ్డి గారు అని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. అంటే కుంభకోణం బరాబర్ జరిగిందన్న మాట. దాని నుండి ప్రజల దృష్టి మరల్చడానికే తమ యువనేత, తెలంగాణ పోరాట యోధుడు మన్నె క్రిశాంక్ ఫోన్ సీజ్ చేశారు. దీన్నే పోలీసు భాషలో అటెన్షన్ డైవర్షన్ అంటారు. ఈ గ్యాంగ్‌లు బ్యాంకుల ముందు తచ్చాడుతూ ఖాతాదారుల మీద రంగు చల్లి వాళ్ల పైసలనెత్తుకొని పారిపోతారు. ఈ గ్యాంగ్‌లు నేడు తెలంగాణలో రాజ్యమేలుతున్నవి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

### ఏక్‌నాథ్ షిండేగా ప్రచారం చేయడం

## దుర్మార్గం

**సిఎం కావాలనే దురద్దేశ్యం లేదన్న పొంగులేటి**

**ధరణిపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల**

**మంచినీటి సమస్యలు రాకుండా చర్యలు**



హైదరాబాద్, మార్చి 21 (ప్రజా మంటలు): పార్లమెంట్ ఎన్నికల తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ ఏకనాథ్ షిండేగా అవుతా రని కొంత మంది సోషల్ మీడియా మిగతా 2లో..

## కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారు

- మల్కాజ్‌గిరి నాయకుల గొప్పతనం వల్లే సిఎం అయ్యా..
- కార్యకర్తలు భుజాలపై మోసి నన్ను ఢిల్లీకి పంపించారు
- దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజ్‌గిరి
- సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- మల్కాజ్‌గిరి పార్లమెంట్ నేతలతో సమీక్ష

దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి అని, నాటి మల్కాజిగిరి గెలుపు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కేసీఆర్ పతనం 2019 మల్కాజిగిరి పార్లమెంట్ నుంచే మొదలైందని, వందరోజులు పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టామని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా..'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ 10లక్షలకు పెంపు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేసుకుంటున్నాం.. మూడు



హైదరాబాద్, మార్చి 21 (ప్రజా మంటలు): మల్కాజ్‌గిరి పార్లమెంట్ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నేను సీఎంగా ఇప్పుడు ఇక్కడ మాట్లాడగలుగుతున్నానంటే ఆ గొప్పతనం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ నాయకులదన్నారు. ఆనాడు నాయకులు అమ్ముడుపోయినా కార్యకర్తలు భుజాలపై మోసి గెలిపించి నన్ను ఢిల్లీకి పంపించారన్నారు. 2,964 బూత్ లలో ప్రతీ బూత్ లో ఒక సైనికుడిలా కార్యకర్తలు పనిచేశారని ఆయన వ్యాఖ్యానించారు.

నెలల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిది.. మల్కాజిగిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంఖుస్థాపన చేసునుకున్నాం.. మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్య తీరాలన్నా.. కాంగ్రెస్ ను గెలిపించుకోవాలి. తెలంగాణ రాష్ట్రమంతా తుఫాను వచ్చినట్లు గెలిచినా మల్కాజిగిరి పార్లమెంట్ లో ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 4 స్థానాలు గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేది.. అందుకే మల్కాజిగిరి పార్లమెంట్ మిగతా 2లో..



## కాంగ్రెస్‌లో చేరిన ముథోల్ మాజీ ఎమ్మెల్యే

**విఠల్ రెడ్డికి కండువా కప్పి ఆహ్వానించిన రేవంత్**

హైదరాబాద్, మార్చి 21 (ప్రజా మంటలు): పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి మిగతా 2లో..

## కేజ్రీవాల్ అరెస్ట్..

**నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న ఈడీ అధికారులు**



న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రజా మంటలు): అంతా అనుకున్నదే జరిగింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మిగతా 2లో..



## కాలేశ్వరం డిజైన్లపై ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఆరా

**వరుసగా రెండోరోజూ ఇంజనీర్లతో భేటీ**

హైదరాబాద్, మార్చి 21 (ప్రజా మంటలు): నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ రెండో రోజు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ మిగతా 2లో..

### లింగంపల్లిలో 10కిలోల

## గంజాయి పట్టివేత

**తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు**



హైదరాబాద్,మార్చి21 (ప్రజా మంటలు): శేరిలింగంపల్లిలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు 10 కేజీల గంజాయి సీజ్ చేశారు. ఒడిస్సా నుంచి ఆంధ్ర మీదుగా హైదరాబాద్‌కు గంజాయి ని పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లో స్మగ్లింగ్ చేస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని హైదరాబాద్ లో ఓ వ్యక్తి అప్పగించే ప్లాన్ చేస్తుండగా పట్టుకున్నారు. ఒడిస్సాకు చెందిన రాహుల్ అనే యువకుడిని రెడ్ హాండెడ్ గా పటు ట్టుకున్నారు. గంజాయి చిన్న చిన్న ప్యాకెట్స్ లో ప్యాకింగ్ చేసి గచ్చిబౌలి ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్టు విక్రమ్ ఒప్పుకున్నాడు. మిగతా 2లో..

## కాంగ్రెస్ ఖాతాల స్తంభన ఓ కుట్ర

- ఎన్నికల్లో అడ్డుకునేలా కుట్ర చర్యలు
- కాంగ్రెస్‌పై మోడీ కక్షసాధింపు చర్యలు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే దుర్మార్గం
- ఎన్నికల్లో కాంగ్రెస్ పాల్గొనకుండా చేసే యత్నం
- ఇసికి తెలిపినా చర్యలు శూన్యం
- బిజెపి ఎన్నికల బాండ్లపై విచారించాలి
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతల ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్‌ను ఇబ్బందులకు గురి చేసేందుకు కాంగ్రెస్ ఖాతాలను స్తంభింప చేశారని, ప్రధాని మోడీ ఇందుకు బాధ్యుడని కాంగ్రెస్ తీవ్రంగా ఆరోపించింది. ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌పై కక్షసాధింపు చర్యలకు దిగారని మండిపడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, జైరామ్ రమేశ్ తదితరులు గురువారం ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్, ఎన్నికల బాండ్ల అంశాలపై నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై తీవ్ర స్థాయిలో మిగతా 2లో..






### పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయానికి

## ఎల్ జే పి ప్రచారం

హైదరాబాద్ మార్చ్ 21 (ప్రజామంటలు): రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ పార్టీతో కలిసి ఎన్నికల ప్రచారం చేసి, అన్ని స్థానాలను గెలుచుకుంటామని, ఎల్ జే పి (లోక్ జనశక్తి పార్టీ ఆర్) చిరాగ్ పాశ్వాన్ వర్గం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మినేని వికాస్ బాబు అన్నారు. ఈరోజు బీజేపీ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి ని కలిసి పార్టీ వ్యూహంపై చర్చించినట్లు, రాబోయే రోజుల్లో అభ్యర్థుల ఆలోచన, అవసరం మేరకు ఆయా నియోజక వర్గాలలో ప్రచారం నిర్వహిస్తామని వికాస్ బాబు తెలిపారు. తమ పార్టీ కార్యకర్తలు రాష్ట్రంలోని 17 నియోజక వర్గాలలో బీజేపీని గెలిపించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. పార్టీ నాయకులు మురళీధర్ రావు దేశపాండే, బింగి రాములు, కట్ట శ్రీనివాస్, మురళి తదితరులు ఆయన వెంబడి కిషన్ రెడ్డిని కలిశారు.

## ప్రజా నాడి




## దేవస్థానంలో బ్రహ్మోత్సవ ప్రత్యేక పూజలు

**పట్టు వస్త్రాలు సమర్పించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్**

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి మార్చ్ 21 (ప్రజా మంటలు): ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన కళ్యాణోత్సవ వేడుకలలో భాగంగా గురు వారం ఉదయం దేవస్థానంలో సాంప్రదాయ ప్రత్యేక పూజలొనరించారు. దేవస్థానం ఎసి ఈ ఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వంలోని ఉత్సవ కమిటీ సభ్యుల మార్గదర్శ కత్వంలో యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్య, వేద పండితులు రమేశ శర్మ, ముత్యాల శర్మ , రమణా చార్య, నరసింహ మూర్తి, కిరణ్, వంశీ, విజయ్, మోహన్, తదితర అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం మునుముందుగా ధ్వజారోహణం, ఉత్సవ సందర్భంగా ప్రత్యేక గరుడస్థంభ పునఃప్రతిష్ఠ, రుక్, యజుర్, సామాధర్వణ వేదాలతో, నలు వైపులా వేద పురుషుల ఆవాహనం, అష్ట దిక్పాలకుల ఆహ్వానం, శేష గద్యము, గరుడ గద్యము, మహా సంకల్పం, అష్ట దిగ్బలులు, బలిహరణాలు, , అన్న ప్రాణ మనో విజ్ఞానా నంద మయముచే సంతానాభిలాషులకు గరుడ దేవానుగ్రహానికై ప్రసాద వితరణ ఆది కార్యక్రమాలను సనాతన పద్ధతిలో నిర్వహించారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్**

ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రేయోగానంద. ఉగ్ర లక్ష్మీనరసింహ, శ్రీవెంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన స్వామి వారల కళ్యాణ మహోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పక్షాన జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషా మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి

## కాంగ్రెస్ ఖాతాల స్తంభన ఓ కుట్ర

విమర్శలు గుప్పించారు. తమ పార్టీని దెబ్బతీసేందుకే ప్రధాని మోదీ తీవ్ర చర్యలకు పాల్పడుతున్నారని వీరంతా మండిపడ్డారు. ఎన్నికల వేళ డబ్బులేకపోవడంతో ప్రచారం చేసులేకపోతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి పాల్పడుతున్న నేరపూరిత చర్య ఇదని మండిపడ్డారు. మా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఈ రోజుల్లో అకౌంట్లు పనిచేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో మీకు తెలుసు. ఎలాంటి లావాదేవీలు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్ చేయడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గేతో పాటు.. ఆ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు మండిపడ్డారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తమ పార్టీకే కాదని మొత్తం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. ప్రజలు పార్టీ కోసం ఇచ్చిన విరాళాలను వాడుకోకుండా చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎన్నికల వేళ ప్రచారం కోసం ప్రకటనలు ఇవ్వలేకపోతున్నాం. మా నేతలను ఎక్కడికీ పంపించలేకపోతున్నాం. విమాన ప్రయాణాలు పక్కనబెట్టండి.. కనీసం రైలు టికెట్లు కొనడానికీ మా వద్ద డబ్బుల్లేవ్ అని రాహుల్ గాంధీ తెలిపారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ ఖాతాలను ఫ్రీజ్ చేయడం కాదని, భారత ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమని ఆయన దుయ్యబట్టారు. ఈ రోజు దేశంలో ప్రజాస్వామ్యం అనేదే లేకుండా పోయింది. అది అబద్ధంగా మారింది. దేశంలో 20శాతం ఓటర్లు మాకు మద్దతుగా ఉన్నారు. కానీ మేం రెండు రూపాయలు కూడా చెల్లించలేక పోతున్నాం. ఎన్నికల్లో పోరాడకుండా మా సామర్థ్యాన్ని అడ్డుకుంటున్నారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కేంద్రంపై రాహుల్ మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యమే లేదన్నారు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తే ఎన్నికల్లో ఎలా పోటీ చేయగలమన్నారు. ఎవరిదైనా బ్యాక్ అకౌంట్ మూసివేసినా, ఏటీఎం కార్డు పని చేయకుండా చేస్తే జీవించగలరా.. ప్రస్తుతం తాము ఎన్నికల్లో ప్రచారం చేసే పరిస్థితి లేకుండా బీజేపీ కుట్రకు పాల్పడిందన్నారు. ఎన్నికలకు 2 నెలల ముందు ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌ను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకూడదనేదే బీజేపీ ఉద్దేశంగా కనిపిస్తోందని రాహుల్ ఆరోపించారు.

అంతకుముందు సోనియా గాంధీ మాట్లాడుతూ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. మా బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను బలవంతంగా లాగేసుకుంటున్నారు. కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రధాని మోదీ వ్యవస్థీకృతంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఓవైపు ఎన్నికల బాండ్ల వ్యవహారం.. మరోవైపు దేశంలోని ప్రధాన ప్రతిపక్షం ఆర్థిక లావాదేవీలపై దాడి జరుగుతోంది. ఇన్ని సవాళ్ల నడుమ ఎన్నికల్లో మేం సమర్థంగా ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం అని ఆమె అన్నారు. ఎలక్టోరల్ బాండ్లు తీవ్రమైన అంశమని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలిపారు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, కాంగ్రెస్‌ను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టే కుట్ర కనిపిస్తోందని, కేంద్రం తీరు సరిగా లేదని, కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ అకౌంట్లపై ముప్పేట దాడి జరుగుతోందని, అకౌంట్లను ఫ్రీజ్ చేయడమనేది దారుణమైన విషయమని సోనియా గాంధీ మండిపడ్డారు. నిధుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ డిమాండ్ చేశారు. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా బీజేపీకి 56 శాతం నిధులు వస్తే.. కాంగ్రెస్‌కు 11 శాతం ఫండ్స్ మాత్రమే వచ్చాయన్నారు. బీజేపీకి రూ.వేల కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఎలా వచ్చాయని ఆమె ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్‌ల వల్ల బీజేపీ భారీగా లాభపడిందన్నారు. తాము ప్రజల నుంచి న్యాయబద్ధంగా సేకరించిన నిధులను ఐటీ ఫ్రీజ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అధికార పక్షం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని.. దేశ చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదని మండిపడ్డారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో జరుగుతున్న పరిణామాలు అసాధారణమైనవని, అప్రజాస్వామికమైనవని సోనియా అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ను అర్థికంగా ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతుందని సోనియా గాంధీ ఆరోపించారు. కేంద్రం తీరు సరిగ్గా లేదన్న ఆమె.. కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలిగించాలని కోరారు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీని బలహిన పరిచే కుట్రలు జరుగుతున్నా యని చెప్పారు. నిధుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగాలంటే తమ బ్యాంకు ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయాలని కోరారు. అభ్యర్థులకు ఇచ్చేందుకు డబ్బు లేదన్నారు. సమయం చూసి కాంగ్రెస్‌ను దెబ్బ తీస్తున్నారని దుయ్యబట్టారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఎవరు లబ్ది పొందారో దేశం మొత్తానికి తెలుసని మరో కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. ఇది అత్యంత తీవ్రమైన అంశమని అన్నారు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసిందని ఆరోపించారు. అధికార పార్టీ వైఖరి ఎంతో ప్రమాదకరమని అన్నారు. బీజేపీ వేల కోట్ల రూపాయిలు విరాళాలుగా తీసుకుని.. కేవలం మా బ్యాంకు ఖాతాలను ఎందుకు స్తంభింపజేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలు, ఆదర్శాలకు భారత్ పేరు గాంచిందని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన విషయం ప్రజలకు తెలిసిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిష్పక్షపాతమైన ఎన్నికలు తప్పనిసరన్నారు. ప్రతి ఒక్కరికీ సమానమైన అవకాశాలు ఉండాలని ఖర్గే పేర్కొన్నారు. మోదీ పాలనలో భారతదేశ ప్రతిష్ట దిగజారు తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖాతాలను సీజ్ చేయడం ద్వారా ఎన్నికల్లో పోటీకి సంబంధించి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. ఓ రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డంకులు సృష్టించడం సరికాదని.. ఖర్గే అభిప్రాయపడ్డారు. ఎక్కడ చూసినా బీజేపీ ప్రకటనలే కనిపిస్తు న్నాయి. తమ బ్యాంకు ఖాతాలు స్తంభిపజేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకెన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తాము ప్రచారం చేసుకోలేకపోతున్నామన్నారు. పోస్టర్లు వేయించడానికి వీలులేని పరిస్థితులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజలకు తమకు మద్దతు ఇవ్వాలని అజయ్ మాకెన్ కోరారు. బీజేపీతో సహా ఏ రాజకీయ పార్టీ ఆదాయపు పన్ను చెల్లించనప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 బ్యాంకు ఖాతాలను ఎందుకు ఫ్రీజ్ చేశారని ఆయన ప్రశ్నించారు.

## కాంగ్రెస్‌లో చేరిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే

వరుస షాకులు తగులుతు న్నాయి. ఇప్పటికే పలువురు కీలక నేతలు పార్టీని వీడారు. కొందరు బీజేపీలో చేరుతుండగా మరికొందరు కాంగ్రెస్ లోకి జంప్ అవుతున్నారు. దీంతో కారు పార్టీ ఖాళీ అవుతుందన్న ప్రచారం జరుగుతోంది. తాజాగా బీఆర్ఎస్‌కు చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరిపోయారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో విఠల్ రెడ్డిని కాంగ్రెస్ లో చేరారు. ఆయన కండువా కప్పి పార్టీలోకి మంత్రి సీతక్క ఆహ్వానించారు. ముధోల్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా విఠల్ రెడ్డి గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన విఠల్ రెడ్డి ఆ తరువాత బీఆర్ఎస్ లోకి వెళ్లారు. 2018లో కూడా ఆ పార్టీ నుంచే పోటీ చేసి మరోసారి విజయం సాధించారు. అయితే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దీంతో ఆయన తన పాతగూడు కాంగ్రెస్ లో చేరారు. విఠల్ రెడ్డి తండ్రి గడ్డన్న కూడా ముధోల్ నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. గడ్డెన్న మంచి నాయకుడిగా పేరుంది.

## కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారు

స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి%ొా% అప్పుడే మన ప్రాంతం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడానికి మనకు అవకాశం వచ్చింది.. పార్లమెంట్ తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవాలి.. హెూలీ పండగలోగా అధిష్టానం అభ్యర్థులను ప్రకటిస్తుంది. కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత నాది. మనకుబలమైన నాయకత్వం ఉంది.. సమన్వయంతో ముందుకెళ్ళాల్సిన అవసరం ఉంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థులు ఒక ఐదుగురు సభ్యులతో కమిటీ వేసుకోవాలి. వారికి పోలింగ్ బూత్ ల వారీగా పని విభజన చేసుకుని సమీక్ష చేసుకోవాలి. రేపు సాయంత్రం కంటోన్మెంట్ లో కార్యకర్తల సమావేశం నిర్వహించుకోవాలి. ఉదయం 7 గంటలకే నాయకులు బస్తీ బాట పట్టాల్సిందే.. ప్రణాళికబద్ధంగా ప్రచారం నిర్వహించుకోవాలి.. మల్కాజిగిరి క్యాంపెయిన్ మోడల్ రాష్ట్రమంతా అనుసరించేలా నిర్వహించాలి. ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నిక అభ్యర్థిది కాదు%ొా% ముఖ్యమంత్రిది.. నా బలం.. నా బలగం మీరే%ొా% ఎట్టి పరిస్థితుల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే..' అని ఆయన వ్యాఖ్యానించారు.

## ఏక్‌నాథ్ షిండేగా ప్రచారం చేయడం దుర్మార్గం

ఇంటర్వ్యూల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ అంశంపై మీడియా ప్రతినిధులతో మాట్లాడినప్పుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత నేనే సీఎం అనడం ఊహాజనితమని మండిపడ్డారు. పళ్ళు ఉన్న చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతాయని.. తన దగ్గర పండ్లు ఉన్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట రోజు ఉంటే నంబర్ 2 ఎలా అవుతానని ప్రశ్నించారు. హైకమాండ్ కూడా నేను సీఎం కావాలంటే కొన్ని ఈక్వేషన్స్ చూస్తుంది కదా..! అని ప్రశ్నించారు. నేను సీఎం కావాలని అనుకోవట్లేదు..ఆలోచన లేదుని.. తాను ఎవ్వరికీ టచ్ లోకి వెళ్ళలేదు..అదంతా ప్రచారం అన్నారు. మా ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు గెలవబోతున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మీద మేము కక్ష పూరితంగా కేసూలు పెడుతున్నామంటున్నారు. అవన్ని గత ప్రభుత్వంలో వారు అధికార దుర్వినియోగంతో చేసిన తప్పులు అన్ని కనబడుతున్నవి కదా అని ప్రశ్నించారు. జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోవడం వంటీ ఫోటోలు. వీడియోలు పెట్టి కొన్ని మిడియా సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వం పై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. మా ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్ లో రాబోయే ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వలు ఉంచాల్సిన బాధ్యత వారిపై ఉంది కాని చేయాల్సిన పనులు చేయకుండా భాద్యత విస్మరించి మాపై రాళ్ళేయడం తగదని మండిపడ్డారు. కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికి తెలిసిందేనని పొంగులే? గుర్తు చేసారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒకటి రెండు ఎంపీ సీట్లు గెలిస్తే గొప్ప అనుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ. మాకు ఎంఐఎం మద్దతు తెలపుతుంది. ఇతర పార్టీల నుండి మా పార్టీలోకి రమ్మని మేం ఎవరిని అడగటం లేదు. వారికై వారు స్వచ్ఛందంగా వస్తున్నారని గుర్తు చేశారు. మేం ఇంకా గేట్లు ఎత్తలేదని ఎత్తితే వరద ఆగదని చేరికలపై వ్యాఖ్యానించారు. మేం చెప్పిందే చేస్తున్నం. గత పాలకుల అవినీతి మీద పోరాడుతూనే. డిస్టర్బ్ అయిన వ్యవస్థను దారిలో పెడుతున్నామన్నారు. 5ఎకరాలకు రైతు బంధు అని చెప్పినట్టే ఇస్తున్నామన్నారు. జీతాల చెల్లింపుల్లో కొంత ఆలస్యం అయిన మాట వాస్తవమే. ఆ దిశగా పరిష్కారం కోసం పనిచేస్తున్నా మన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడేందుకు వెనుకాడ బోమమని.. 14స్థానాలు గ్యారెంటీ గెలుస్తామన్నారు. రెండు సంవత్సరాలు కంటే ఎక్కువగా ఉన్న అధికారులను మొత్తం షిఫ్ట్ చేస్తాం... రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేస్తామని.. ధరణి లో మంచి అంశాలు ఉంటే ఉంచి.. భూమాత పోర్టల్ ను తీసుకొస్తామని ప్రకటించారు. ధరణిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ధరణికి సంబంధించి తన వద్ద మరింత సమాచారం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేస్తామని.. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి ఫోన్లను ట్యాపింగ్ చేయడం లేదని స్పష్టం చేశారు. ధరణి ద్వారా జరిగిన అక్రమాలన్నిం టినీ ఆధారాలతో సహా బయటపెట్టి, శ్వేతపత్రం విడుదల చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత సర్కారు ధరణిని రహస్య డాక్యుమెంట్‌గా చూసిందని, తమ ప్రభుత్వం ఏదీ దాచి పెట్టదని స్పష్టం చేశారు. ధరణిలో ప్రజలకు ఇబ్బంది కలిగించే విషయాలను తొలగించి.. మంచి వాటిని కొనసాగిస్తామన్నారు. గురువారం మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు.రిజిస్ట్రేషన్ల శాఖను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సమస్య నుంచి బయటపడ్డామని, మంచి నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసే ప్రసక్తే లేదన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్‌తో చర్చించి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా తెలంగాణలో 14 స్థానాలు గెలుస్తుందని, ఇప్పుడున్న పరిస్థితుల్లో బిఆర్ఎస్‌కు ఒకటో, రెండో వస్తే గొప్ప అని వ్యాఖ్యానించారు.

## లింగంపల్లిలో 10కిలోల గంజాయి పట్టివేత

హైదరాబాద్ కు చెందిన విక్రమ్, ఒడిస్సాకు చెందిన జగన్నాథ్ బిస్వా పరారీలో ఉన్నారు. ఎన్ డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో నిందితుడు దిగగానే 10 కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ఓ వ్యక్తి గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు లింగంపల్లి స్టేషన్‌కు చేరుకుని నిఘా ఉంచారు. రైలు దిగి స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువకుడి బ్యాగులో ఉన్న 10 కిలోల గంజాయిని సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కాలేశ్వరం డిజైన్లపై ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ ఆరా

ఇంజినీర్లతో సమావేశమైంది. ఎర్రమంజిల్‌లోని జలసౌధలో చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ ఇంజినీర్లతో విడివిడిగా చర్చలు జరిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ డిజైన్ల వివరాలపై ఆరా తీస్తోంది. వాటిని రూపొందించిన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లతో ఇప్పటికే బుధవారం సమావేశమైంది. గురువారం కూడా ఈ భేటీ కొనసాగింది. ప్రాజెక్టు నిర్మాణంలో బాధ్యులైన ఇంజినీర్లతో విడివిడిగా సమావేశమవుతున్న చంద్రశేఖర్ అయ్యర్, సభ్యులు.. డిజైన్లకు సంబంధించిన వివరాలు తీసుకున్నారు. ఆనకట్టల నిర్వహణ బాధ్యతలు చూసే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం నుంచి కమిటీ సమగ్ర వివరాలు కోరింది. 2019లో సమస్యలు ఉత్పన్నమైనప్పటి నుంచి తీసుకున్న చర్యలు, చేపట్టిన తనిఖీల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణ పనులు చేసిన గుత్తేదార్ల ప్రతినిధులతోనూ నేడు సమావేశం కానుంది. మూడు ఆనకట్టల మోడల్స్‌ను కమిటీ శుక్రవారం పరిశీలించనుంది.

## దేవస్థానంలో బ్రహ్మోత్సవ ప్రత్యేక పూజలు



పట్టు వస్త్రాది కానుకలను సమర్పించారు. 13 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్స వాల సందర్భంగా దేవస్థానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్, దేవ స్థానం ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, ముఖ్య అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ళ శ్రీనివాసాచార్యులు, ఆస్థాన వేద పండితులు రమేశ్ శర్మ, ముత్యాల శర్మ, అర్చకులు సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్థానిక ఇసుక స్థంభ ప్రవేశ ప్రదేశం నుండి దేవస్థానం వరకు మంగళ వాద్యాలు తోడురాగా సాంప్రదాయ దుస్తులు ధరించిన కలెక్టర్ పట్టు వస్త్రాలను తలపై పెట్టుకుని నడిచి వెళ్ళారు. ప్రధాన దైవమైన యోగానంద నారసింహాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజాదికాలలో పాల్గొన్నారు. కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ కృష్ణ చైతన్య, సి ఐ రాం నరసింహా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తదితరులు వెంట ఉన్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్ని ఆలయాలలో దైవ దర్శనాలు చేసుకుని, పట్టు వస్త్రాలు సమర్పించారు. కలెక్టర్ ను స్వామి, అమ్మవార్ల శేషవస్త్ర సన్మానితులు గావించి, ప్రసాదం అందజేశారు. అర్చకులు, పండితులు వైదికాశీస్సులు గావించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల స్థాయి అధికారులు, భక్తులు పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన లేదు.

**జానపద గీతాలతో, భక్తజన సందోహంతో కిటకిటలాడిన ధర్మపురి క్షేత్రం**

ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ నర సింహ (ఉగ్ర, యోగానంద, శ్రీ వెంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన కళ్యాణ మహోత్సవ సందర్భంగా గురు వారం ధర్మపురి పట్టణం భక్తజన సందోహంతో కిటకిట లాడింది. "తడి బట్ట స్నానాలయ్యో నరసయ్యా, నీ గుళ్ళో పూజలయ్యో, చంకనా పాప లయ్యో నరసయ్యా, నెత్తిమీద ముళ్ళాలివిగో: గండి దాటి మేమొస్తిమో నరసయ్యా, గట్టెక్కించి మమ్ము దోలవో" అంటూ జానపద బాణీలలో రాష్ట్ర తర ప్రాంతాల నుండి ఏతెంచిన భక్తుల భగవన్నామ స్మరణలతో, గీతాలా పనలతో క్షేత్రం మారు మోగింది. ఔరంగాబాద్, చంద్రాపూర్, నాందేడ్ లాంటి సుదూర ప్రాంతాల నుండి ప్రత్యేక మరియు ఆర్టీసి బస్సులలో ప్రాచీన వంశ పారంపర్య ఆచార క్రమంలో వచ్చిన అసంఖ్యా క భక్తులు పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, కళ్యాణానికి దైవాల దర్శనార్థం బారులు తీరి వేచి నిలుచున్నారు. కళ్యాణోత్సవ సందర్భంగా దేవస్థానంలోని ప్రధానాలయాలలో పంచోపనిషత్ యుక్త ప్రత్యేక పూజలు, నిత్య ధ్వజారోహణాది కార్యక్రమాలను వేద పండితులు రమేశ శర్మ సంబంధిత ఆలయాల అర్చకులు, దేవ స్థానం ఎసి, ఈఓ శ్రీనివాస్, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించారు. దేవస్థానంలో తాత్కాలిక టెంట్లు, క్యూలైన్లు విద్యుత్ దీపాలు, వివిధ స్టాల్సును ఏర్పాటు చేశారు. జగిత్యాల ఆర్టీసీ డిపో శిబిరం పక్షాన వివిధ డిపోల నుండి నడిపిన ఆర్టీసి బస్సులను రద్దీకి అనుగుణంగా క్రమ బద్ధీకరించారు. మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం పక్షాన భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. జగిత్యాల ఎస్పీ మన్ ప్రీత్ సింగ్ దర్శకత్వంలో డీఎస్పీ, ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాం నరసింహా రెడ్డి,పర్యవేక్షణలో ఎస్ ఐ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగకుండా బందోబస్తు నిర్వహించారు.



ఉచిత అన్నదానం ప్రారంభం బ్రహ్మోత్సవాల సందర్భంగా, టి టి డి ధర్మశాలలో, దేవస్థానం పక్షాన భక్తుల, యాత్రికుల సౌకర్యార్థం బ్రహ్మోత్సవ విశేష ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించగా, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్, దేవస్థానం ఎసిఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వంలోని అభివృద్ధి కమిటీ సభ్యులు, కరీంనగర్ డీ సీ ఎం ఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్లు, వర్తక వ్యాపార ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజలు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ 10,016 రూపాయల విరాళాన్ని అందజేశారు.

## కేజ్రీవాల్ అరెస్టు... నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న ఈడీ అధికారులు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన మనీ లాండరింగ్ వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్(55)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నాటకీయ పరిణామాల మధ్య అరెస్టు చేసింది. ఈ కేసులో అరెస్టు చేయకుండా కేజ్రీవాల్‌కు రక్షణ కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు తేల్చిచెప్పిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈడీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

గురువారం సాయంత్రం నుంచి పరిణామాలు చకచకా జరిగిపోయాయి. తొలుత అదనపు డైరెక్టర్ నేతృత్వంలో 10 మంది ఈడీ అధికారులు సెర్చ్ వారెంట్‌తో ఢిల్లీ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని కేజ్రీవాల్ అధికారిక నివాసానికి చేరుకున్నారు. రెండున్నర గంటలపాలు ప్రశ్నించారు. కేజ్రీవాల్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లను సీజ్ చేశారు. అనంతరం రాత్రి 9.11 గంటలకు ఆయనను అరెస్టు చేశారు. రాత్రి 11 గంటలకు తమ ప్రధాన కార్యాలయానికి తరలించారు.

కేజ్రీవాల్‌కు శుక్రవారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించి, కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకొని, విచారణ జరపాలని ఈడీ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. కేజ్రీవాల్ అరెస్టు సమాచారాన్ని ఆయన భార్యకు తెలియజేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో సిట్టింగ్ ముఖ్యమంత్రి అరెస్టు కావడం సంచలనాత్మకంగా మారింది. ఇదే కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవితను గతవారం ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

**కేజ్రీవాల్ నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత**

కేజ్రీవాల్ అరెస్టు సందర్భంగా ఆయన నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కేజ్రీవాల్‌కు అనుకూలంగా, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేజ్రీవాల్ నివాసం చుట్టూ ఢిల్లీ పోలీసులతోపాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మోహరించారు. స్థానికంగా 144 సెక్షన్ విధించారు. నినాదాలు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

హైకోర్టు ఉత్తర్వుపై సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్

లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌కు ఈడీ ఇప్పటిదాకా తొమ్మిది సార్లు సమన్లు జారీ చేసింది. ఒక్కసారి కూడా ఆయన విచారణకు హాజరుకాలేదు. గురువారం కూడా విచారణకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ రాలేదు. తనకు సమన్లు జారీ చేయడం చట్టవిరుద్ధమని ఆయన చెప్పారు. ఈడీ తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, ఊరట దక్కలేదు. అరెస్టు చేయకుండా రక్షణ కల్పించలేమని హైకోర్టు గురువారం స్పష్టం చేసింది.

ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును వ్యతిరేకిస్తూ ఆయన వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. గురువారం రాత్రే అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. ఇంతలోనే అరెస్టయ్యారు. కేజ్రీవాల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. లిక్కర్ స్కామ్‌లో ఈడీ గతంలో దాఖలు చేసిన చార్జిషీట్లలో కేజ్రీవాల్ పేరును అధికారులు పలుమార్లు ప్రస్తావించారు.

**జైలు నుంచే పరిపాలన!**

కేజ్రీవాల్ అరెస్టు అయినప్పటికీ ఢిల్లీ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, అవసరమైతే జైలు నుంచే పరిపాలన కొనసాగిస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియన్ నేత అతీషి ప్రకటించారు. కేజ్రీవాల్‌ను చూసి ప్రధాని నరేంద్ర మోదీ భయపడుతున్నారని, అందుకే లోక్‌సభ ఎన్నికల ముందు అక్రమంగా జైలుకు పంపించడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. సరిగ్గా ఎన్నికల సమయంలోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం వెనుక పెద్ద కుతంత్రం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా విమర్శించారు.
కేజ్రీవాల్ అరెస్టును తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారు. ప్రతిపక్ష నేతలను మోదీ ప్రభుత్వం వేధిస్తోందని మండిపడ్డారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికం, దిగజారుడుతనానికి నిదర్శనమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆక్షేపించారు. మరోవైపు, లిక్కర్ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ వెంటనే రాజీనామా చేయాలని, దర్యాప్తునకు సహరించాలని ఢిల్లీ బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

# కన్నుల పండువగా ధర్మపురీశుల కళ్యాణం

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**






ధర్మపురి మార్చి 21 (ప్రజామంటలు) :

దక్షిణ కాశీగా, హరిహర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమై నదిగా, రాష్ట్రంలో పేరెన్నికగన్న గోదావరీ తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రంలో, గురు వారం రాత్రి శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీనారసింహ వేంకటేశ్వర స్వాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు వైభవోపేతంగా, కన్నుల పండువగా జరిగాయి. స్థానిక దైవాల బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన మువ్వురు ఇలవేలుపుల కళ్యాణోత్సవాల సందర్భంగా ఇసుక స్తంభ ప్రదేశానికి వేంచేసిన స్వాములకు ప్రత్యేక పూజలొ నరించారు. సాయంత్రం గోధూళి శుభ ముహూర్తంలో సర్వాంగ శోభితంగా తీర్చి దిద్దిన నూతన నిర్మిత కళ్యాణ వేదికయైన దేవస్థానంలోని శేషప్ప కళా వేదికపైకి ఆలయాలనుండి స్వాముల ఉత్సవ మూర్తులను వేదమంత్రోచ్ఛారణల మధ్య, మంగళవాద్యాలతో భక్తజనం తోడురాగా కొని తెచ్చి ఆసీనుల గావించారు. సాంప్రదాయ రీతిలో యజ్ఞోప వీత ధారణ, రక్షా గోత్రనామ ప్రవరలు, కన్యాదానం, మంగళా ష్టకములు, గూడజీర ధారణ, అక్షతారో పణాది కార్యక్రమాలను విధి విధానంగా నిర్వహిం చారు. పురపాలక సంఘం పక్షాన కమీషనర్, సిబ్బంది, తదితరులు స్వాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, కట్నకానుకలను సమర్పించారు. చిల్వా కోడూరుకు చెందిన గందె సుదర్శనరావు, వెంగళాపురం గందె ధర్మారావు, కాంతారావు, గుళ్ళ కోటకు చెందిన గంపుల లక్ష్మీ నర సింహారావు కుటుంబీకులు దైవ కళ్యాణానికి తలంబ్రాలు, మట్టెలు, మంగళ సూత్రాలను వంశపారం పర్య ఆచార నేపథ్యంలో కానుకలుగా సమర్పించారు. దేవస్థానం ఎసి,ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వంలోని అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో యజ్ఞాచార్యులు పురుషోత్తమా చార్య, వేద పండితులు రమేష్ శర్మ, సంబంధిత అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణోత్సవానికి అశేష భక్తులు హాజరైనారు. ప్రత్యేక టికెట్లు తీసుకుని వేలాది మంది కళ్యాణ కార్యక్రమా లలో ప్రత్యక్ష భాగస్వాములైనారు. భక్తులు వేదిక ముందు ఆసీనులై తిలకించారు. రాత్రి 10 గంటల వరకూ కళ్యాణ కార్యక్రమం కొనసాగగా, రాష్ట్రంలో వేరెచ్చటను లేని విధంగా క్షేత్ర ప్రాచీన ఆచార నేపథ్యంలో, రాత్రి 10 గంటలకు ప్రధానాలయాలలో మూల విరాట్టులకు కళ్యాణం జరిపించారు. శృంగేరీ పీఠం ఆస్థాన పౌరాణికులు బాచంపెల్లి సంతోష్ శాస్త్రి ప్రత్యక్ష వ్యాఖ్యానం ఆకట్టుకుంది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, డీ ఎస్పీ రఘు చందర్, ఆర్డీఓ మధుసూదన్, తహ శీల్దార్ కృష్ణ చైతన్య,మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, వైస్ రామయ్య, జెడ్పీటీసీ అరుణ, రాజేందర్ , ఎంపీపీ రాజమణి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు కార్యక్రమాలలో భాగస్వాములైనారు. డీఎస్పీ రఘు చందర్, సి ఐ రాం నరసింహా రెడ్డి మార్గదర్శకత్వంలో, ధర్మపురి ఎస్ ఐ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ ప్రత్యేక పోలీసు బృందాలు ఎలాంటి అవాంఛనీయాలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులను ప్రత్యేక క్యూల ద్వారా వేదిక వద్దకు పంపారు.

# సుప్రీం ఆదేశాలతో దారికొచ్చిన పతంజలి

**తప్పుడు ప్రకటనలపై బేషతు క్షమాపణలు**

**ఇకముందు ఇలా జరక్కుండా చూస్తామని హామీ**



న్యూఢిల్లీ,మార్చి21 (ప్రజా మంటలు):

తప్పుడు ప్రకటనల కేసులో కోర్టుకు సమాధానం చెప్పాలంటూ పతంజలి ఆయుర్వేదాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశించిన తరుణంలో కంపెనీ కీలక ప్రకటన చేసింది. సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడంతో పాటు బేషరతుగా క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి తప్పు చేయబోనని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ అన్నారు. బాబా రామ్‌దేవ్‌తో పాటు ఆచార్య బాలకృష్ణలు ఏప్రిల్ 2న స్వయంగా హాజరు కావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆదేశాలు ఉన్నప్పటికీ తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసినందుకు కోర్టు నోటీసు జారీ చేసింది. గతంలో జారీ చేసిన నోటీసులకు పతంజలి ఆయుర్వేదం ఎండీ ఆచార్య బాలకృష్ణ సమాధానం ఇవ్వకపోవడంపై జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టుకు ఇచ్చిన హామీని ప్రాథమికంగా ఉల్లంఘించినందుకు ఆయనపై ధిక్కార చర్యలు ఎందుకు ప్రారంభించకూడదని ప్రశ్నించింది. కొవిడ్ టీకాతో పాటు మెడిసిన్ల కు వ్యతిరేకంగా రామ్‌దేవ్ ప్రచారం నిర్వహిస్తున్నారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐఎంఏ ఆరోపించింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ క్రమంలో పతంజలి ఆయుర్వేద ఎండీ ఆచార్య బాలకృష్ణగురువారం సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారు. తమ కంపెనీకి చెందిన ఉత్పత్తులపై వచ్చిన వాణిజ్య ప్రకటనల కేసులో ఆయన సారీ తెలిపారు. తప్పుడు యాడ్స్ ఇస్తున్నారని పతంజలి సంస్థకు రెండు రోజుల క్రితం సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆ కంపెనీ సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేసింది. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ ఆషానుద్దీన్ అమనుల్లా ఆ కేసును వాదించారు. ఏప్రిల్ 2వ తేదీన కోర్టు ముందు హాజరుకావాలని బాలకృష్ణకు ఆదేశాలు జారీ చేశారు. అయితే కోర్టు ఆదేశాల పట్ల తనకు ఎనలేని గౌరవం ఉందని, తమ ఉల్లంఘనల పట్ల క్షమాపణలు చెబుతున్నట్లు అఫిడవిట్‌లో బాలకృష్ణ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు రాకుండా తమ కంపెనీ జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది

**అందుకే సంస్థలు, అధికారులపై విమర్శలు - బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా విమర్శలు**



న్యూఢిల్లీ,మార్చి21(ప్రజా మంటలు):

లోక్‌సభ ఎన్నికలు సమీపించే వేళ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల తూటాల పేలుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం ఒకరిపై ఒకరు ఘాటు విమర్శలు చేసుకుంటున్నారు. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా కాంగ్రెస్ పార్టీపై విరుచుకు పడ్డారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం పార్టీని జనాలు పూర్తిగా తిరస్కరించబోతున్నారని జోస్యం చెప్పారాయన. ఆ పార్టీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే భారత ప్రజాస్వామ్యం, ఐటీ, దర్యాప్తు సంస్థలు, అధికారులపై విరుచుపడుతున్నరన్నారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు జేపీ నడ్డా. 'కాంగ్రెస్ పార్టీ తన అసమర్థత, చేతకాని తనాన్ని 'ఆర్థిక ఇబ్బందులు' గా పేర్కొంటోంది. అయితే నిజానికి వారు ఆర్థికంగా దివాళా తీయ లేదు. నైతికంగా, మేధోపరంగా దివాలా తీశారు. ఐటీ లేదా ఢిల్లీ హైకోర్టు అయినా నిబంధనలకు లోబడి ఉంటాయి. అందుకు తగ్గట్టే పన్నులు చెల్లించాలని కాంగ్రెస్ పార్టీని కోరాయి. కానీ ఆ పార్టీ ఎప్పుడూ అలా చేయలేదు' దేశంలో ప్రతి రంగాన్ని, ప్రతి రాష్ట్రాన్ని, చరిత్రలోని ప్రతి క్షణాన్ని అన్ని విధాలా దోచుకున్న పార్టీ ఆర్థిక క్రమశిక్షణ గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులంటూ చెబుతున్న కాంగ్రెస్ నేతలు జీపు నుంచి హెలికాప్టర్ల వరకు బోఫోర్స్ లాంటి అన్ని స్కామ్ ల ద్వారా దాచుకున్న సొమ్మును తమ ప్రచారానికి వాడుకోవచ్చు. భారతదేశంలో ప్రజాస్వామ్యం అబద్ధమని కాంగ్రెస్ పార్ట్‌టైమ్ నాయకులు అంటున్నారు. 1975- 1977 మధ్య కొన్ని నెలలు మాత్రమే భారతదేశం ప్రజాస్వామ్యం కాదని, ఆ సమయంలో భారత ప్రధాని ఇందిరా గాంధీ తప్ప మరెవరో కాదని నేను వారికి వినమ్రంగా గుర్తు చేస్తున్నాను' అని ట్వీట్‌లో రాసుకొచ్చారు జేపీ నడ్డా.

## తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్న మయన్మార్ సైన్యం

**యూఎన్ ప్రత్యేక ప్రతినిధి ఆండ్రూస్ వెల్లడి**



మయన్మార్,మార్చి21(ప్రజా మంటలు):

మయన్మార్ సైన్యం ప్రస్తుతం తీవ్రమైన ఒడుదొడుకులు ఎదుర్కొంటందని యూఎన్ ప్రత్యేక ప్రతినిధి టామ్ ఆండ్రూస్ తెలిపారు. దాన్ని ఆ ముప్పు తప్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. మయన్మార్ పై చాలా దేశాలు ఆంక్షలు విధించారని తెలిపారు. 2021లో అధికారంలోకి వచ్చిన జుంటా దళాలు గతంలో ఉన్న ప్రభుత్వాన్ని అణిచి వేశాయని వెల్లడించారు. మయన్మారు జుంటాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని యూఎన్ ప్రత్యేక ప్రతినిధి టామ్ ఆండ్రూస్ తెలిపారు. దీన్ని సమర్థవంతంగా అంతం చేయడానికి ప్రపంచం దేశాలు సహాయం చేయాలని అన్నారు. కొన్ని ఆంక్షలు విధించడం ద్వారా అది సాధ్యం అవుతుందన్నారు. జుంటా దళాల మధ్య భారీ ప్రాణనష్టం, ఫిరాయింపులు, లొంగుబాట్లు కారణంగా అవి బలహీన పడుతుందని వెల్లడించారు. ముఖ్యంగా రిక్రూట్ మెంట్ సవాళ్లను ఎదుర్కొనడంలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని వెల్లడించారు. ఫిబ్రవరి 2021లో తిరుగుబాటు చేసి జుంటా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ తర్వాత గత పదేళ్లుగా అక్కడి అధికారంలో ఉన్న ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని నాశనం చేసిందని వెల్లడించారు. దీని కారణంగా దేశాన్ని మరోసారి రక్తశిక్తం చేసిందన్నారు. ప్రస్తుతం దేశంలో దీర్ఘకాలంగా ఉన్న జాతి తిరుగుబాటు దళాలను అణిచివేయడానికి ప్రస్తుతం జుంటా దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని అన్నారు. అయితే ప్రస్తుతం దేశంలో హింస, అస్థిరత, ఆర్థిక క్షీణత ఏర్పాడడానికి ప్రధాన కారణం జుంటా అని ఆండ్రూస్ వెల్లడించారు.జుంటూ సింగపూర్ అందించే ఆయుధాల సరఫరాను చాలా వరకు తగ్గించిందని అన్నారు. ప్రస్తుతం జుంటాకు చైనా, రష్యా దేశాలే ప్రధానంగా ఆయుధ సమాగ్రిని సరాఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆదేశంలో ప్రపంచ దేశాలకు ఉన్న ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అవసరం ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ప్రపంచం ఇతర ఘర్షణపై తన కేంద్రీకరించడం వల్ల మయన్మార్ పై తమ దృష్టి సన్నగిల్లిందన్నారు. ఇలాంటి సమయంలో ప్రజాస్వామ్య, మానవ హక్కులను గౌరవించే మయన్మార్ ను నిర్మించడం చాలా అవసరం అని ప్రపంచ దేశాలకు తెలిపారు. అక్కడి ప్రజల మద్దతుగా అని దేశాలు సహకరించాలని కోరారు.

# ఇసిల నియామకంలో స్టే ఇవ్వలేం

**జోక్యం చేసుకుంటే గందరగోళానికి దారితీయగలదు**

**కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పని భావించలేం**

**సుప్రీంకోర్టులో పిటిషన్లపై విచారణలో ధర్మాసనం వెల్లడి**



న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రజా మంటలు):

ఇసిల నియామకం అంశంలో స్టే ఇచ్చేందుకు సుప్రీం నిరాకరించింది. ఇద్దరు కమిషనర్ల నియామకాన్ని కూడా తప్పుపట్టలేమని తేల్చి చెప్పింది. లోక్‌సభ ఎన్నికల ముందు ఈసీల నియామకం అంశం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం నూతనంగా తీసుకొచ్చిన చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. చట్టంపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ దశలో నిలిపివేస్తే అది తీవ్ర గందరగోళానికి దారితీస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఇటీవల ఈసీలుగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్ నియామకాలను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. కొత్తగా నియమితులైన వారిపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థ. అది పాలనాయంత్రాంగం కింద పనిచేస్తుందని చెప్పకూడదు. ఈసీల నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పు అని భావించలేం. ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ సమయంలో సమతుల్యత పాటించాల్సిన అవసరం చాలా ముఖ్యం' అని ధర్మాసనం అభిప్రాయపడింది. 2023 చట్టం రూపొందించక ముందు ఎన్నికల కమిషనర్ల నియామక తాత్కాలిక కమిటీలో ప్రధాని, సీజేఐ, లోక్‌సభలో విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై కేంద్రం బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. కొత్త చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది. ఇదిలావుంటే భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా లేని ఎంపిక కమిటీ నూతన ఎన్నికల కమిషనర్లను నియమించడం సరైందేనని సుప్రీంకోర్టులో కేంద్రం పేర్కొంది. 2023 చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది. ఈ మేరకు న్యాయమంత్రిత్వశాఖ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రమాణపత్రం దాఖలు చేసింది. 2023 చట్టం ప్రకారం హడావుడిగా కొత్త ఈసీల నియామకం జరిపామన్నది సరికాదని స్పష్టం చేసింది. ఎంపిక కమిటీలో న్యాయసభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం లేదా ఏ సంస్థ అయినా స్వతంత్రంగా ఉంటుందనుకోవడం అపోహ అని పేర్కొంది. పూర్తి కార్యనిర్వాహక విచక్షణతో నియమించిన కాలంలోనూ ఎన్నికల కమిషనర్లు తటస్థంగా, ప్రభావవంతంగా విధులు నిర్వహించారు. ఒక ఉన్నత రాజ్యాంగ కార్యాలయంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాజ్యాంగంలోనే రక్షణ ఉంది. అది ఆయనకు నిష్పక్షపాతంగా పనిచేసే అవకాశం కల్పిస్తుందని తెలిపింది. ఈసీల ఎంపిక కోసం రూపొందించిన జాబితాను విపక్షాలతో పంచుకోలేదన్న ఆరోపణలను మంత్రిత్వశాఖ కొట్టిపారేసింది. ఈ నెల 13నే లోక్‌సభలో విపక్షనేత అధీర్ రంజన్ చౌధరీకి జాబితాను సమర్పించామని తెలిపింది. అందులోంచే నూతన ఈసీల నియామకం జరిగిందన్న విషయాన్ని గుర్తుచేసింది. ఇటీవల ఖాళీ అయిన రెండు ఎన్నికల కమిషనర్ల పదవులను మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్‌లతో 2023 చట్టం ప్రకారం ఏర్పాటైన కొత్త కమిటీ భర్తీ చేసిన సంగతి తెలిసిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలు - సర్వీసు షరతులు, పదవీకాలం చట్టం-2023ను ప్రజాస్వామ్యయుతంగా, అందరినీ కలుపుకొనేలా రూపొందించామని పిటిషన్‌లో న్యాయమంత్రిత్వశాఖ తెలిపింది. 2023 చట్టం రూపొందకముందు ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ప్రధాని, సీజేఐ, విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని కాంగ్రెస్ నేత జయా ఠాకుర్‌తో పాటు ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్) సవాల్ చేసింది.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**ఎకరాకు పదివేల పరిహారం చెల్లిస్తాం**

**గతంలో సాయం చేయని బిఆర్ఎస్ దుష్ప్రచారం**

**పార్లమెంట్ ఎన్నికల తరవాత బిఆర్ఎస్ గల్లంతు**

**మంత్రి జూపల్లి కృష్ణావావు వెల్లడి**



నిజామాబాద్,మార్చి21 (ప్రజా మంటలు):

పంట నష్టం జరిగిన రైతులకు ఎకరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 వేలు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించినట్లు లో మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు.ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తెలంగాణలో పలు జిల్లాల్లో రైతులకు పంట నష్టం జరిగింది. అయితే ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్న సమయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నదాతలకు శుభవార్త చెప్పారు. 'ఉల్టా చోర్ కొత్వాల్ కు డాంటే అన్నట్లు బీఆర్ఎస్ నాయకుల తీరు ఉంది. ప్రభుత్వం ఏర్పాటైన వారం గడువక ముందే ఇది అమలు చేయలేదు అని అధికార కాంక్షతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గల్లంతు అవుతుంది. ఒక్క సీట్ నెగ్గడం గగనమే. త్వరలో బీఆర్ఎస్ పార్టీ మూతపడుతుంది. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ లో చేరుతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిని రైతన్నలు నష్టపోయారు. నష్టం జరిగిన రైతులందరికీ పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జూపల్లి వివరించారు. రైతులు ఎవరు కూడా నిరాశ నిస్పృహలకు గురికావద్దు. పంట నష్టంపై సర్వే చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతన్నల ఆత్మస్థైర్యం దెబ్బతినొద్దని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పంట నష్టం జరిగిన రైతులకు ఎకరానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతుల సంక్షేమం కోసం పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నామని' మంత్రి జూపల్లి కృష్ణారావు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అకాల వర్షాలు, వరదలు వచ్చినా, కరువు వచ్చి పంటలు దెబ్బతిన్న గత పదేళ్లలో పంట నష్టం కింద సాయం చేయలేదని.. కనీసం పంట నష్టంపై నివేదికలు కూడా తెప్పించలేదన్నారు జూపల్లి కృష్ణారావు. రైతు భరోసా పథకం ద్వారా 3.5 ఎకరాల లోపు ఉన్న రైతులకు ఇప్పటికే రూ. 4,295 కోట్లు జమ చేశామన్నారు. 69.86 లక్షల రైతులకు గాను 58.66 లక్షల మంది రైతులకు రైతు భరోసా చెల్లించారు. మిగిలిన రైతులకు వారం రోజుల్లో వారి ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు చెప్పారు. రైతుల సమస్యలు తీరుస్తూనే, మూడు నెలల స్వల్ప కాలంలోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఒకటో తారీకునే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నాం. 30 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి 8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే నాటికి తెలంగాణ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అధిక వడ్డీ భారమైన ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్నామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

## పీఎం కిసాన్‌పై లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్

# 17వ విడత నిధుల జమ మరింత ఆలస్యం..!




న్యూఢిల్లీ,మార్చి21 (ప్రజా మంటలు):

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం అనేది వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు ఆదాయ మద్దతును అందించే రైతుల సంక్షేమ పథకం. ఈ పథకం కింద అర్హులైన రైతులందరికీ ఒక్కో కుటుంబానికి రూ.6000 చొప్పున కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనం కల్పిస్తుంది. ఫిబ్రవరి 28న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 16వ విడతను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. మొత్తం రూ. 6,000 వార్షిక మొత్తంలో ప్రధానమంత్రి ఈ విడత రూ. 2,000 చొప్పున 9 కోట్ల మంది రైతుల ఖాతాలకు బదిలీ చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రధాని మోదీ విడుదల చేసిన మొత్తం రూ. 21 వేల కోట్లకు పైగా ఉంది. పీఎం-కిసాన్‌లో 9,01,67,496 మంది రైతులు లబ్ధి పొందారు. అయితే పీఎం కిసాన్ 17వ విడత సొమ్ము త్వరలోనే కేంద్ర ప్రభుత్వం రిలీజ్ చేయనుంది. పీఎం కిసాన్ 17వ విడత నిధులు పొందాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. పీఎం కిసాన్ వెబ్ సైట్ ప్రకారం పీఎం కిసాన్ నమోదు చేసుకున్న అర్హులైన రైతులకు ఈ-కేవైసీ తప్పనిసరి. పీఎం కిసాన్ పోర్టల్లో ఓటీపీ -ఆధారిత ఈ-కేవైసీ అందుబాటులో ఉంది. బయోమెట్రిక్ ఆధారిత ఈ-కేవైసీ కోసం రైతులు సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాలను కూడా సంప్రదించవచ్చు.పీఎం-కిసాన్ పథకం షెడ్యూల్ ప్రకారం వాయిదాలు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి విడుదల చేస్తారు. గత ఏడాది నవంబర్లో విడుదల కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 16వ విడత విడుదలైంది. కాబట్టి పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత జూన్ 2024లో విడుదల అవుతుంది. అయితే లోక్ సభ ఎన్నికల కారణంగా ఇది ఆలస్యమయ్యే అకాశం ఉందని చెబుతున్నారు.


# బిజెపికి దక్షిణాధిపత్యం సాధ్యమేనా?



దక్షిణ రాష్ట్రాల్లో పాగా వేస్తే తప్ప తాము కోరుకున్న 400 మార్కును దాటలేమని మోడీ ద్వయానికి బాగా తెలుసు. అందుకే వారు దక్షిణాది వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఉత్తరాదిలో రాముడు రక్షిస్తాడన్న ధీమా వచ్చేసింది. రామనామం ఉత్తరాదిలో ఊపేస్తోంది. అనన్య సాధ్యమైన అయోధ్య సాకారం అయ్యింది. దీంతో ఉత్తరాదిలో బిజెపికి తిరుగులేదన్న విధంగా పరిస్థితులు ఉన్నాయి. కానీ దక్షిణాది పరిస్థితి వేరు. కర్నాటక కూడా చేజారిపోయింది. తెలంగాణలో వచ్చిన అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నారు. ఇప్పుడేమో తెలంగాణలో 17 సీట్ల కోసం నానా తంటాలు పడుతున్నారు. అందుకే తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ ఎక్కువ కష్టపడు తున్నారు. దక్షిణాదిని ఈసారి గుప్పిట పెట్టుకోవాలని ఆయన పట్టు దలగా ఉన్నారని కనిపిస్తోంది. తమిళనాట అన్నాడిఎంకె దూరమైనా చిన్నా చితక పార్టీలతో జతకట్టారు. గవర్నర్‌గా ఉన్న తమిళసై మళ్లీ రాజకీయ అరంగేట్రం చేశారు. బిజెపిని ముందునుంచి ప్రజలు ఉత్తరాది పార్టీగానే గుర్తిస్తూ వచ్చారు. అయితే దానిని తిరగరాస్తూ కర్నాటకలో కాలుమోపారు. కానీ స్థానిక నాయకత్వం నిర్లక్ష్యం, అవినీతి కారణంగా మొన్నటి అసెంబ్లీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బిజెపి జాతీయవాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం యత్నిస్తోంది. భారతదేశంలో బిజెపి అంతటా విస్తరించిం దని చెప్పుకోవడం కూడా అవసరం. అందుకే విజయం కోసం భారతీయ జనతాపార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. గత పదేళ్ల బిజెపి పాలనా కాలం తీసుకుంటే అన్ని రాష్ట్రాల్లో విస్తరించేందుకు చేయని ప్రయత్నం లేదు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా అభివృద్ధి, సెంటిమెంట్ ఎజెండా లను కలుపుకుని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈశాన్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధికి పెద్దపీట వేసింది. బెంగాల్ లోను, దక్షిణ రాష్ట్రాల్లో గెలుపు కోసం బూత్‌లెవల్ కార్యాచరణను అమలు చేస్తోంది. క్షేత్రస్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచు కోగలిగిన శక్తిని బీజేపీ ప్రదర్శిస్తోంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్త లు దండిగా ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారు అలుపెరగకుండా ప్రయత్నాలన్ని చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే కర్నాటకలో ఎత్తులు,పొత్తులతో అధికారం చేజిక్కించుకున్నారు. కర్ణాటక విజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2014లోనే ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో తగినంత ఉనికి తో ఎప్పటి నుంచో సత్తా చాటుతోంది. గత పార్లమెంటు ఎన్నికలలో నాలుగు స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో తన ఉనికిని విస్తరించు కోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. అక్కడక్కడా ఉనికి లో ఉన్నప్పటికీ దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. బీజేపీకి, మోదీకి అదే అంతిమలక్ష్యంగా మారింది. అందుకే దక్షిణాదిపై ఎక్కువగా దృష్టి సారించారు. ఉత్తరాదిలో ఈసారి మరిన్ని సీట్లు పెరిగే అవకాశమున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఆ సంఖ్యను మరింత పెంచుకోవడం కోసం దక్షణాదిలో ప్రత్యేక ప్రయత్నం మొదలు పెట్టారని చెప్పాలి. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి పరిస్థితి ఆశాజనకంగా ఉంది. మోడీ వ్యక్తిగత ఛరిష్మా కూడా పనిచేస్తోంది. ఆ రెండు రాష్ట్రాల్లో గతం కంటే ఓట్లు,సీట్లు పెంచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కర్ణాటకలో ఇప్పటికే కాంగ్రెస్ పాలన మీద విముఖత కలిగిందన్న ప్రచారం మొదలయ్యింది. ఈ క్రమంలో అక్కడ పార్లమెంట్ సీట్లు అధికంగా వస్తాయని అంచనా వేస్తున్నారు. గతంలో ఉన్న బలాన్ని నిలుపుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి ఏర్పాటు కావడంతో అక్కడ విజయం సాధించడం ద్వారా కొంత మేలు కలిగే అవకావం ఉంది. ఈ కలయిక దీర్ఘకాలికంగా బీజేపీ విస్తరణ ప్రయత్నాలకు తోడ్పడగలదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభావం గణనీయంగానే పెరిగింది. ఇప్పుడది ఆ పార్టీకి కీలక మయిన విజయం అవుతుందని భావి స్తోంది. తెలంగాణలో అధికప్రభావం చూపగలిగితే కనుక, బీజేపీ వెంటనే రెండో స్థానానికి, అతి త్వరలో అధికార స్థానానికి చేరుకోగలుగుతుంది. తెలంగాణలో బలం పెంచుకోవడంతో పాటు ఆంధ్రాలో నాలుగు సీట్లు సంపాదించుకుంటే లక్ష్యం నెరవేరి నట్లే. నిజానికి తెలంగాణ బీజేపీకి ముందునుంచి అనుకూలంగానే ఉన్నా దానిని సక్రమంగా వినియోగించు కోవడంలో బిజెపి తప్పటడుగులు వేసింది. బీఆర్ఎస్‌లో కొందరిని, కాంగ్రెస్‌లో కూడా కొందరిని తమ వైపు తిప్పుకుని చక్రం తిప్పగల అవకాశం బీజేపీకి వస్తుంది. ఇకపోతే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా దక్షిణ భారతదేశంలో తమిళనాడుతో పాటు మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి మొదటి దశలో 42 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఎన్నికల పక్రియ ప్రారంభమైంది. తమిళనాడులో ఒకే దశలో ఎన్నికలు పూర్తి కానున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం తమిళనాడులోని 39 స్థానాలకు గాను డీఎంకే 24, కాంగ్రెస్ 8, సీపీఐ, సీపీఎం చెరో రెండు సీట్లు, వీసీకే, ఐయూఎంఎల్ ఒక్కో సీటు, అన్నాడీఎంకే ఒక్కో సీటు గెలుచు కున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో గౌరవప్రదమైన స్థాయిలో సీట్లు గెలవడంపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ప్రధానంగా తమిళనాడులోని 39 స్థానాల్లో మిత్రపక్షాలతో కలిసి పోటీ చేస్తుంది. ఈసారి కనీసం 5 నుంచి 10 స్థానాలు ఎన్డీయే కూటమి గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. తమిళనాడులో గత బీజేపీకి ప్రస్తుత బీజేపీకి పూర్తిగా తేడా కనిపిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతూ వస్తోంది. పాదయాత్రలతో పాటు.. డీఎంకే అవినీతిపై ఆయన ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు విడుదల చేశారు. దీంతో డీఎంకే సైతం బీజేపీని టార్గెట్ చేయడం మొదలుపెట్టింది. దీంతో డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పోరు.. డీఎంకే, బీజేపీగా మార్చేశారు అన్నామలై. ప్రధాని మోదీ సైతం తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. దీంతో తమిళనాడులో బీజేపీ ఏ మేరకు ప్రభావం చూపిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.







## నీరే ఆధారం!

ఎర్రటి ఎండల్లో నెర్రలు బారిన నేలల
మధ్య వలసల్లా సాగుతోన్న దాహం!
ఒక్క చెలమ చెలిమి లేని ఒంటరి
ఇసుక దారుల్లో కన్నీటి పొరల్లోంచే
కానరాని నీటిజాడ కోసం అన్వేషణ!
అమృత దారల్లాంటి వర్షపు నీళ్ళు
నేలపాలైన గాజు బొమ్మలా వెక్కిరిస్తుంటే
నదుల ఊపిరి తీసేలా ప్రవాహదారుల్ని
అడ్డగించి రిసార్టుల్ని గుండెలపై అదిమేసి
నదీమ తల్లిని ఎముకల గూడులా మార్చి
అడవుల్లో ఆటవిక రాజ్యం స్థాపించి
పచ్చదనాన్ని నల్లధనంగా మార్చేసి
నేలతల్లి గుండెల్లోకి ఎండిన బోర్లేసి
భూగర్భజలాలకు గర్భశోకం తెచ్చిపెట్టి
అవినీతి సంపాదనకే తప్ప సాగునీటికి
తాగునీటికి పథకాలు ప్రణాళికలు లేని
దూరదృష్టి రాహిత్యపు దురదృష్టాల్ని
వెంటేసుకొని ఎండిన బావుల చుట్టూ
ఆవురావురాని మూగే కాకులమయ్యేం!
ఖాళీ బిందెలు బీళ్లు పడిన నేలలు
ఎడారి గొంతులతో పాడిపంటలు కరువై
గుండె తడారిన బతుకులయ్యేక ఇకనైనా
మనం కళ్ళు తెరవాలి! ప్రతి నీటి బిందువు
సాక్షాత్తూ అమృత బిందువేనని గుర్తించాలి!

– భీమవరపు పురుషోత్తమ్, రాజమండ్రి
9949800253

(నేడు ప్రపంచ జల దినోత్సవం)





## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను సబ్ స్క్రయిబ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

## తండ్రి వాటా..



ఆనంద వరం అనే గ్రామంలో సీతయ్య అనే రైతు ఉండేవాడు. అతనికి ముగ్గురు కుమారులు. వారిని ఉన్నత చదువులు చదివించాడు సీతయ్య. పెద్ద కుమారునికి,రెండవ కుమారునికి మంచి ఉద్యోగాలు వచ్చాయి. చిన్న కుమారునికి ఉద్యోగం రాలేదు. తన తండ్రి సంపాదించిన నాలుగు ఎకరాల పొలం లోనే తన జీవనం గడుపుతు,తన తండ్రి సీతయ్యను బాగా చూసుకునేవాడు.

ఒక రోజు సీతయ్య తన ముగ్గురు కుమారులను తన వద్దకు పిలిపించుకున్నాడు. తన ఆస్తిని నాలుగు భాగాలు చేస్తున్నానని చెప్పాడు. వెంటనే పెద్ద కుమారుడు మేము ముగ్గురు కుమారులమే కదా! నాలుగవ వాటా ఎవరికి అని ప్రశ్నించాడు. అప్పుడు తండ్రి సీతయ్య ఆ వాటా నాకే అని చెప్పాడు.

కొన్ని రోజులు గడిచిన తర్వాత తన కుమారులను మళ్ళీ పిలిపించాడు. ఎవరైతే నన్ను బాగా చూసుకుంటారో వారికి నా నాలుగవ వాటా ఇస్తానని చెప్పాడు. సంవత్సరం లో పన్నెండు నెలలు ఉంటాయి,ప్రతి కుమారుడు నన్ను నాలుగు నెలలు బాగా చూసుకోవాలని తండ్రి పలికాడు. సరే! అని పెద్ద కుమారుడు ముందుగ తన తండ్రిని ఇంటికి తీసుకుని వెళ్లి నాలుగు నెలలు బాగా చూసుకున్నాడు. తర్వాత తన వంతుగా రెండవ కుమారుడు తన తండ్రి ఆస్తి కోసం నాలుగు నెలలు బాగా చూసుకున్నాడు. చిన్న కుమారుడు తన వంతుగా ఇంతకు ముందు ఎలా చూసుకునే వాడో అలాగే ప్రేమతో చూసుకున్నాడు.

సంవత్సరం తర్వాత ముగ్గురు కుమారులు తండ్రి వద్దకు వచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నా వాటా నా చిన్న కుమారునికి ఇస్తున్నానని కుమారులకు చెప్పాడు. పెద్ద కుమారుడు ఇది న్యాయం కాదని నిన్ను మీము కూడా బాగా చూసుకున్నామని తండ్రిని అడిగాడు. వెంటనే తండ్రి నేను వాటా ఇస్తానని మీకు చెప్పడం వల్లనే నన్ను మీరు బాగా చూసుకున్నారని, నా చిన్న కుమారుడు నాకు వాటా లేనప్పుడు కూడా ఏమి ఆశించ కుండా నన్ను ప్రేమగా చూసాడని తండ్రి తెలిపారు.

తండ్రి మాటలు విన్న పెద్ద కుమారుడు, రెండవ కుమారుడు తమ తప్పును క్షమించమని తండ్రిని వేడుకుని, అతని పాదాలపై పడ్డారు. తండ్రి వారిని లేవనెత్తి ప్రేమగా ఆలింగనం చేసుకున్నాడు. తన కుమారులకు జ్ఞానోదయం కలిగినందుకు తండ్రి సీతయ్య ఎంతో సంతోషపడ్డాడు.

నీతి: ఆస్తి పాస్తుల కన్నా ప్రేమాభిమానాలే మిన్న..

డి.చంద్రమోహన్, ఎన్ తిమ్మాపురం, గుంతకల్లు
9177948813

## మార్పు తెచ్చిన అక్క



రంగాపురం అనే గ్రామంలో సింధు, ఇందు అనే ఇద్దరు అక్కా చెల్లెలు ఉండేవారు. సింధు ఎనిమిదవ తరగతి చదువుతుంది. ఇందు నాలుగవ తరగతి చదువుతుంది.

ఇద్దరూ ఒకే పాఠశాలకు వెళ్లేవారు. చెల్లిని త్వరగా నిద్ర లేపి పాఠశాలకు తీసుకెళ్లేది. ప్రతిరోజు తరగతి గదిలో ఇందు ప్రవర్తన మీద ఫిర్యాదులు వచ్చేవి అక్క సింధుకు.

ఇందు తోటి స్నేహితులతో కలిసేది కాదు. ఎవరైనా పక్కన కూర్చుంటే వారిని కూర్చోనిచ్చేది కాదు. అందరితో గొడవలు పడేది.

'చెల్లీ ..మనము అందరితో కలిసి ఉండాలి. ప్రేమగా మాట్లాడాలి" అని అక్క ఎంత చెప్పినా వినిపించుకునేది కాదు. అక్కతో కూడా ఇంట్లో ఎప్పుడూ గొడవపడేది. చెల్లి ప్రవర్తన చూసి అక్క చాలా బాధపడిపోయేది.

పెద్దవారు ప్రేమగా పలకరించినా కసురుకునేది ఇందు. పాఠశాలలో భోజన విరామ సమయంలో తను ఒక్కతే ఒంటరిగా కూర్చొని భోజనం చేసేది. తన స్నేహితులు ఎంత పిలిచినా రాకపోయేది.

ఒకరోజు ఇందు పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు వెళ్ళే దారిలో అక్క చెల్లిని గుడికి తీసుకెళ్తుంది. గుడి బయట ఉన్న ఒక వృద్ధునికి అమ్మ చేసిన పాయసాన్ని ఇవ్వమని చెప్తుంది.

"నేను ఇవ్వను . పాఠశాలకు వెళ్లిన తర్వాత తింటాను" అని అంటుంది. "పుట్టిన రోజు వృద్ధులకు సాయం చేస్తే పుణ్యం వస్తుంది. ఇవ్వు" అని ఆ పాయసాన్ని బలవంతంగా వృద్ధునికి పెట్టిస్తుంది.

ఆ వృద్ధుడు చాలా సంతోషించి ఇందును ఆశీర్వదిస్తాడు. ఇందుకు కొత్తగా అనిపిస్తుంది. తన స్నేహితులతో ఈ విషయాన్ని చెప్పి చాలా సంతోషపడుతుంది.

"చూసావా ! చెల్లీ.. పంచడంలో ఎంత ఆనందం ఉంటుందో..వారిని గౌరవిస్తే మనల్ని ప్రేమగా చూస్కుంటారు" అని చెప్తుంది అక్క.

ఆరోజు నుండి తన స్నేహితులతో కలిసి కూర్చొని భోజనం చేసేది. పెద్దలలో ప్రేమగా మాట్లాడేది ఇందు. చెల్లిలో వచ్చిన మార్పుకు చాలా సంతోషించింది అక్క.

–వేముల రాణి
6305393291.

# ఆ ఐదు స్థానాలపై బిఆర్ఎస్‌లో ఉత్కంఠ

**ఎటూ తేల్చుకోలేక పోతున్న గులాబీబాస్ - పోటీ చేసేందుకు పలువురు విముఖత**

**అభ్యర్థుల ఎంపికపై తర్జనభర్జన - మెదక్ స్థానంలో హరీష్‌ను నిలిపే ఆలోచన**



హైదరాబాద్, మార్చి 21 (ప్రజామంటలు):

ఐదు లోక్‌సభ స్థానాల్లో అబ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. కొందరు పోటీకి విముఖంగా ఉండడం కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. ఈ క్రమంలో అబ్యర్థుల ఎంపిక ఆలస్యం అవుతోందని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీ నేతలు తమ అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బిజీబిజీగా ఉన్నాయి. మొత్తం 17 పార్లమెంటు స్థానాలకు గానూ పలువురు అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించేశాయి.

అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ ఎంపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించేశారు. అయితే ఐదు స్థానాలపై మాత్రం పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. మెదక్, సికింద్రాబాద్, నల్గొండ, భువనగిరి, హైదరాబాద్ స్థానాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ ఐదు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన కాస్త ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెండింగ్ స్థానాల అభ్యర్థుల కోసం కేసీఆర్ మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. నేతలు పార్టీ వీడుతుండటం కూడా అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారింది. నల్గొండ నుంచి బరిలో నిలపడానికి మొదట గుత్తా అమిత్ రెడ్డి పేరును బీఆర్ఎస్ పరిశీలించింది. అయితే అమిత్ రెడ్డి పోటీకి నో చెప్పడంతో సైదిరెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సైదిరెడ్డి కూడా బీజేపీలోకి వెళ్లడంతో అభ్యర్థి కోసం గులాబీ బాస్ తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నల్గొండ కోసం కంచర్ల కృష్ణారెడ్డి, కడారు అంజయ్య యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే బీఆర్ఎస్ అధినేత మాత్రం కంచర్ల కృష్ణారెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక భువనగిరిలోనూ అదే పరిస్థితి నెలకొంది. భువనగిరి కోసం మొదట మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పేరును బీఆర్ఎస్ పార్టీ దాదాపు ఖరారు చేసింది. కానీ పైళ్ల కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో మరో అభ్యర్థి కోసం కేసీఆర్ కసరత్తు మొదలుపెట్టారు. ప్రస్తుతం భువనగిరి రేసులో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, దూదిమెట్ల బాలరాజు ఉన్నారు. మరోవైపు సికింద్రాబాద్ నుంచి తలసాని సాయికిరణ్ పోటీకి విముఖత చూపడంతో మరో అభ్యర్థి కోసం బీఆర్ఎస్ అన్వేషణ సాగిస్తోంది. సికింద్రాబాద్ కోసం పద్మారావు, దాసోజు శ్రావణ్, రావుల శ్రీధర్ రెడ్డి పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి పద్మారావును పోటీ చేసేందుకు బీఆర్ఎస్ ఒప్పిస్తున్నట్లు తెలుస్తోంది.

అటు మెదక్ అభ్యర్థిపైనా పీటముడి ఇంకా వీడలేదు. మొదట మెదక్ కోసం ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి పేరును కేసీఆర్ పరిశీలించారని సమాచారం. వెంకట్రామిరెడ్డి పోటీకి ఆసక్తి చూపకపోవడంతో ఒంటేరు ప్రతాపరెడ్డి పేరును అధినేత పరిశీలిస్తున్నారు. అలాగే హైదరాబాదులో పోటీ నామ మాత్రమే కావడంతో మిగిలిన నాలుగు స్థానాలపైనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకటి, రెండు రోజుల్లోనే పెండింగ్ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఉండే అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచార వ్యూహాలను రచిస్తున్నారు. ఇకపోతే మెదక్ సీటు మరింత ప్రతిష్టాత్మకం కావడంతో ఇక్కడ గెలుపు గుర్రాలపై ఆలోచన చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమానికి ముందు నుంచి బీఆర్ఎస్ ఇక్కడ గెలుస్తోంది. 2009లో టీఆర్ఎస్ నుంచి విజయశాంతి, 2014లో మెదక్ నుంచి కేసీఆర్ ఎంపీగా గెలిచారు. మళ్లీ ఉప ఎన్నికల్లోనూ, 2019 లోక్ సభ ఎన్నికల్లోనూ కొత్త ప్రభాకర్ రెడ్డి టీఆర్ఎస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఒక్క మెదక్ తప్ప..మిగతా ఆరు స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక్కడ సిద్దిపేట నుంచి హరీశ్ రావు, గజ్వేల్ నుంచి కేసీఆర్, దుబ్బాక నుంచి కొత్త ప్రభాకర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలిచారు.

మెదక్ లో బీఆర్ఎస్ కు మంచి పట్టు ఉన్నా ప్రస్తుతం లోక్ సభకు పోటీ చేసేందుకు ఎవర్ని బరిలోకి దింపాలనేదానిపై అధిష్టానం తర్జనభర్జనలో పడింది. లోక్‌సభ ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుస్తామనుకుంటున్న స్థానాన్ని ఎలాగైనా వదులుకోవద్దని బీఆర్ఎస్ చూస్తోంది. కాంగ్రెస్ నుంచి నీలం మధు పేరు వినిపిస్తోంది. బీజేపీ నుంచి రఘునందన్ రావు బరిలో దిగారు. ఇక బీఆర్ఎస్ నుంచి మెదక్ లోక్‌సభకు తాజాగా

హరీశ్ రావు లేదా కేసీఆర్ పోటీచేయాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు. కీలక నేతలు బరిలో దిగితే ఖచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే హరీశ్ రావు మెదక్ నుంచి పోటీ చేస్తే పార్టీ క్యాడర్ లో జోష్ వస్తుందంటున్నారు. కేసీఆర్ కూడా హరీశ్ ను పోటీ చేసేందుకు మొగ్గుచూపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఎవ్వరూ కాదంటే మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేరును కూడా పరిశీలిస్తున్నారు. మొత్తంగా మిగిలిన ఐదు స్థానాల్లో గులాబీ బాస్ ఎవర్ని బరిలోకి దింపుతారో అన్న ఉత్కంఠ కలుగుతోంది. ఇక నాగర్‌కర్నూలులో మాత్రం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ ఖాయమని అంటున్నారు.

## అంగరంగ వైభవంగా చలి గల్ శ్రీలక్ష్మి నారసింహుని కళ్యాణ వేడుకలు

జగిత్యాల రూరల్ మార్చి 21 (ప్రజా మంటలు)
జగిత్యాల మండలం చలిగల్ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, సాంప్రదాయ బద్ధంగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి కళ్యాణ వేడుకలను కొనసాగించారు. విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వహకులు ఏర్పాట్లు చేశారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, కళ్యాణ అక్షితలు అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు కల్యాణాన్ని తిలకించడానికి విచ్చేశారు. స్వామి వారి నామస్మరణతో కళ్యాణ వేదిక మార్మోగింది.





## జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ

జగిత్యాల మార్చి 21 (ప్రజా మంటలు)
లిజిల్లా జడ్జి శ్రీమతి నీలిమ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఏఎస్ పి శివం ఉపాధ్యాయ ఐపీఎస్ పూల మొక్కను అందజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

జగిత్యాల మార్చి 21 (ప్రజా మంటలు)
పెంబట్ల గ్రామానికి చెందిన దుసర దుబ్బయ్య,అర్ప పల్లి గ్రామానికి చెందిన లక్ష్మి,గంగారాం లు రోడ్డు ప్రమాదం లో గాయపడి జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండగా వారిని పరామర్శించి,మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ .అనంతరం తాళ్ళ ధర్మారం గ్రామానికి చెందిన రాజేందర్ అనారోగ్యం తో చికిత్స పొందుతూ ఉండగా పరామర్శించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్





మెట్ పల్లి పోలీస్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో సెంట్రల్ ఫోర్స్ తో పోలీస్ స్టేషన్ వరకు కవాత్ నిర్వహించారు.

## స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణ కొరకే ఫ్లాగ్ మార్చ్

**ప్రశాంత వాతావరణం లో ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలి..**

జగిత్యాల మార్చి 21 (ప్రజా మంటలు)
జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మెట్ పల్లి కేంద్రంలో జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ వంటి కవాతును అడిషనల్ ఎస్పీ భీమ్ రావు జెండా ఊపి ప్రారంబించారు.
ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం లో ఎన్నికల నిర్వహణకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని అన్నారు.
ఈ ఫ్లాగ్ మార్చ్ లో డిఎస్పీ ఉమామహేశ్వరరావు సిఐఎస్ఎఫ్ అదికారులు, సీ.ఐ లు సురేష్ బాబు, నవీన్ కుమార్ మరియు ఎస్.ఐ లు పోలీస్ సిఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



# పటిష్ట మైన ప్రణాళికతో రానున్న లోక్ సభ ఎన్నికల నిర్వహణ

## జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

**అక్రమంగా డబ్బు, మద్యం రానీయకుండా పకడ్బందీగా చెక్ పోస్టు ల నిర్వహణ**

**సోషల్ మీడియా పై నిఘా కొరకు 24/7 ఐటీ సభ్యుల తో కూడిన స్పెషల్ టీం**



జగిత్యాల మార్చ్ 21 (ప్రజామంటలు):
జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో రాబోవు లోక్ సభ ఎన్నికలు జరిగేలా జిల్లా ఎన్నికల అధికారితో మరియు ఇతర శాఖల సమన్వయంతో కలిసి పని చేస్తున్నామని జిల్లా ఎస్పి తెలిపారు. తద్వారా జిల్లాలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పిస్తాం అన్నారు. ఫ్లయింగ్ స్వాడ్, స్టాటిస్టిక్ సర్వెల్లేన్స్ టీమ్ లు, వీడియో టీమ్ లు, ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళిని పాటించాలని కోరారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. ప్రత్యేక ఇంటలిజెన్స్ ద్వారా సమాచారాన్ని సేకరించి ఎలక్షన్ కమిషన్ గైడ్ లైన్స్ ప్రకార%శీ% ఎన్నికల నియమావళిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

చెక్ పోస్ట్ లు:
అన్ని ప్రభుత్వ శాఖల సమక్షంలో, సమన్వయము తో జిల్లా సరిహద్దుల్లో ఉన్న 9 చెక్ పోస్ట్ ల లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రణాళికతో ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా మొబైల్ చెక్ పోస్టు లను ను ఏర్పాటు చేయడంతో పాటు సర్ప్రైజ్ వెహికల్ చెకింగ్, నాక బంది వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

స్వాధీన పరుచుకున్న వివరాలు:
ఇప్పటివరకు స్వాధీనపరచుకున్న నగదు 6,80,000 రూపాయలు.
లిక్కర్ 239.15 లీటర్ల సుమారుగా అంచనా విలువ 1,44,854 రూపాయలు.

లైసెన్సుడు ఆయుధముల డిపాజిట్:
ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియామవళి అనుసారంగా లైసెన్సు కలిగిన ఆయుధములు అన్నియు డిపాజిట్ కొరకు అండర్ సెక్షన్ 144 సి ఆర్. పి సి అనుసరించి నిషేధాజ్ఞలు జారీ చేయడం జరిగింది.

సోషల్ మీడియా పై నిఘా కొరకు 24/7 ఐటీ సభ్యులతో కూడిన స్పెషల్ టీం:
అనవసరమైన విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే లేదా ఇతరులను కించపరిచే విధంగా ఉండేటువంటి పోస్టులు పెట్టే వారిపై వేగవంతమైన చర్యలు తీసుకునేందుకు గాను ఐటీ కోర్ టీం సభ్యులతో కూడిన స్పెషల్ టీం ను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ నందు ఏర్పాటు చేయడం జరిగినది. కావున ఏదైనా వాట్సాప్ గ్రూప్లో లేదా ఇతర సోషల్ మీడియాలో పెట్టేటువంటి పోస్టులకు వాటి యొక్క గ్రూప్ అడ్మిన్లు బాధ్యత వహించవలసి ఉంటుందని ఎస్పి స్పష్టం చేశారు.

## జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో జ్యోతి హై స్కూల్ ఐఐటి విద్యార్థులు ఎంపిక




జగిత్యాల మార్చ్ 21 (ప్రజామంటలు):
పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటి అకాడమీ కి చెందిన విద్యార్థులు మారుతి, రెహమతుల్లా , విగ్నేష్ , నిక్షిత్ , సాత్విక్ లు ఈనెల మార్చ్ 13 న భీమారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ గోవిందారంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ లెవెల్ సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొని ఈ నెల 22,23,24 వ తేదిలలో నల్గొండ జిల్లా ఆలేరు లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకి ఎంపిక కావడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ్ రావు విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత, రజిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనుల్లో బయల్పడిన విగ్రహాలు పూజలు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

గొల్లపల్లి/ఎండపల్లి మార్చ్ 21 (ప్రజామంటలు): ఎండపల్లి మండలంలో ఉపాధి హామీ పనుల్లో భారీ విగ్రహాలు బయటపడ్డాయి. వివరాల్లోకెళ్తే.. ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీలు గురువారం ఎల్కలదేవి గుట్టకు కందకాలు తవ్వుతుండగా విగ్రహాలు బయటపడ్డాయి. సుమారు 15 విగ్రహాలు వరుసగా బయల్పడినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ జుంజుపెల్లి సురేష్ తెలిపారు. కాగా ఈ విగ్రహాలకు ఉపాధిహామీ కూలీలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తున్నారు.



## పోషణ పక్షం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన

గొల్లపల్లి మార్చ్ 21 (ప్రజామంటలు):
గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతల కు తగు సలహాలు సూచనలు 1000 రోజుల ప్రాముఖ్యత గురించి తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించి ఆకుకూరలు కూరగాయలు బెల్లం, పల్లిలు, చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడవచ్చు అని ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. గృహ సందర్శనలు చేసి 0 నుంచి 6 నెలల పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలిపారు ఈ కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్ మమిడాల జ్యోతి, అంగన్వాడీ టీచర్లు సునీత, శ్యామలత, శాంత, ఆశ వర్కర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



## పరామర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్ మార్చ్ 21 (ప్రజామంటలు):
జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు చింత నర్సయ్య, పుట్ట గంగారాం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. వెంట వైస్ ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్,ఎంపీటీసీ సౌజన్య తిరుపతి,గ్రామ శాఖ అధ్యక్షులు ఆరే రవి,నాయకులు నక్క హరీష్, షేర్ల మహేష్, మల్లేశం, రెడ్డి, శేఖర్, కరుణాకర్, రాజేందర్, తోట మహేష్, సలీం, తదితరులు పాల్గొన్నారు.



## ములుకనూర్ లో నాటుసారా స్వాధీనం ఒకరి అరెస్టు

భీమదేవరపల్లి, మార్చి 21 (ప్రజామంటలు):
మండలంలోని ముల్కనూరు వడ్డెర కాలనీలో గురువారం వల్లెపు రాజయ్య నుండి నాలుగు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ముల్కనూరు వడ్డెర కాలనీలో అటు పోలీసులు, ఇటు ఎక్సైజ్ అధికారుల కళ్ళు కప్పి కొంతమంది నాటు సారా వ్యాపారం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. వారి వైఖరి మార్చుకోకపోతే త్వరలోనే వారిని పట్టుకుంటామని పేర్కొన్నారు. వారం రోజుల క్రితం నాటుసారా అమ్ముతూ పట్టుబడిన గొల్లెన రజిత అనే మహిళను రిమాండ్ కు తరలించామని చెప్పారు. ఎవరైనా నాటు సారా అమ్మిన, కొన్న వారి పైన చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆయనతోపాటు ఎక్సైజ్ ఎస్సై తిరుపతి, ఖలీల్ కోటి, లాలయ్య, వీరమల్లు, రషీద్, అయ్యోబు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు రూ. 25,116 విరాళం

కొడిమ్యాల మార్చి 21 (ప్రజామంటలు):
కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయమునకు కొడిమ్యాల వాస్తవ్యులు బద్దం జనార్దన్ రెడ్డి - దేవేంద్ర పెద్ద కొడుకు కోడలు : మధుసూదన్ రెడ్డి - త్రివేణి మనుమడు : విద్వాన్ రెడ్డి, చిన్న కొడుకు కోడలు : చందు %--% లహరి, తల్లిదండ్రులు: లింగారెడ్డి-లక్ష్మి ల కుటుంబం ఆలయనికి “శాశ్వత చందా దారులు” గా 25,116/- రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి ధన రూపేనా సహకరించిన దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి సహకరించిన దాతల కుటుంబానికి ఆలయ కమిటీ తరపున, భక్తుల తరపున, గ్రామస్తుల తరపున ప్రత్యేక ధన్యవాదములు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

జగిత్యాల / బీర్పూర్ మార్చ్ 21 (ప్రజామంటలు):
బీర్పూర్ మండలం తుంగూర్ గ్రామం బిఆర్ఎస్ నాయకులు ఉమ్మడి సారంగపూర్ మండల మాజీ జడ్పీటీసీ ముక్క శంకర్ మరియు తదితర నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బీర్పూర్ ఎంపీపీ మాసర్తి రమేష్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుభాష్, తుంగూర్ గ్రామం సర్పంచ్ గుడిసె శ్రీమతి జితేందర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, మల్లారెడ్డి, చిక్కుల్ల చంద్రయ్య తదితర నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



# నిరుపేద బాలికకు గుండెలో రంధ్రం

**చికిత్సకు దాదాపు రూ. 8 లక్షల ఖర్చు - సహాయం చేయాలని వేడుకోలు**



మల్లాపూర్ మార్చి 21 (ప్రజామంటలు): మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామంలో నివాసముంటున్న నిరుపేద బరిండ్ల రాజు మమత దంపతులు నిర్మల్ జిల్లా కడెం మండలం కల్లెడ గ్రామానికి చెందినవారు కాగా వీరు పొట్టకూటి కోసమై మొగిలిపేట గ్రామానికి వలస వచ్చి ఇక్కడే కూలీ పని చేసుకొంటూ జీవిస్తున్న క్రమంలో పదవ తరగతి చదువుతున్న వారి కూతురు బరిండ్ల రాజకళ (17) కు అకస్మాత్తుగా శరీరమంతా ఇన్ ఫెక్షన్ సోకి రక్తపు వాంతి చేసుకోగా వెంటనే నిజామాబాద్ లోని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షలు జరిపి సదరు బాలికకు గుండెలో రంధ్రం పడిందని, చికిత్స ఖర్చు దాదాపు 8 లక్షల వరకు అవుతుందని తెలుపగా ఆర్థిక స్థోమత లేని ఆ కుటుంబం బాలికను హైదరాబాద్ లోని గాంధీ హాస్పిటల్ కు తరలించి తాత్కాలిక చికిత్స అందిస్తున్నప్పటికి ఆ బాలిక మృత్యువుతో పోరాడుతోంది. రెక్కాడితే డొక్కాడని మా కుటుంబాన్ని ఆదుకోవాలని మా బిడ్డకు జీవితాన్ని ప్రసాదించండని ఆ పేద దంపతులు ఎవరికి తోచిన విధంగా వారు సహాయం చేయాలని వేడుకుంటున్నారు వారి ఫోన్ పే నెంబర్ 6300307565.

# తాగునీటి ట్యాంకులను తనిఖీ చేసిన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

**నీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉండాలి - తక్షణమే పైప్ లైన్ లీకేజీల రిపేర్లు**





జగిత్యాల మార్చి 21 (ప్రజామంటలు): త్రాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రంగా ఉన్న వాటిని, లీకేజీల ను పరిశీలించి రిపేర్ చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అధికారులను కోరగా అప్పటికప్పుడు పైప్ లైన్ గత 25 సంవత్సరం క్రితం నిర్మాణం చేపట్టగా అవి నేడు లీకేజీలతో ఉందని వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు. పట్టణ ప్రజలకు నిత్యం అందించే తాగునీటి ట్యాంకులను 15 రోజులకొకసారి శుభ్రపరచాలని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సాయిబాబా ఆలయంలో మున్సిపల్ చైర్పర్సన్ ప్రత్యేక పూజలు

**చైర్పర్సన్ జ్యోతిని సన్మానించిన ఆలయ కమిటీ**



జగిత్యాల మార్చి 21 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా మున్సిపల్ చైర్పర్సన్ గా నియామకమైన సందర్భంగా జ్యోతి లక్ష్మణ్ ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ చుక్క నవీన్, సాయిబాబా మందిరం చైర్మన్ బల్మూరి సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, వైస్ చైర్మన్ మారాకైలాసం, కోశాధికారి రాంకిషన్ రావు, కళాశ్రీ గుండేటి రాజు, కంచి కిషన్, కడాలి రామకృష్ణ, తౌటు రామచంద్రం, అడువాల శ్రీనివాస్ తదితరులున్నారు.

# అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్

**అధ్యక్షురాలుగా అల్లాడి శ్యామల, కార్యదర్శి కైరి లావణ్య**



మల్లాపూర్ మార్చి 21 (ప్రజామంటలు): అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ నూతన నియమాకం మల్లాపూర్ మండలంలో అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ మల్లాపూర్ మండలం లోని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయి ఈశ్వరి ఆధ్వర్యంలో జరిగింది. మండల కమిటీ మండలంలోని నూతన కమిటీని నియమించడం జరిగింది. అధ్యక్షులుగా అల్లాడి శ్యామల, కార్యదర్శి కైరి లావణ్య లను ఎన్నుకొని కార్యవర్గాన్ని నియమించారు.

# బీసీ సంక్షేమ సంఘం ముఖ్యనాయకుల సమావేశం

**బీసీల రిజర్వేషన్ 50 శాతం చేయాలని డిమాండ్**



మెట్ పల్లి మార్చి 21 (ప్రజామంటలు): మెట్ పల్లి లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు నల్ల వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో మెట్ పల్లి పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు జరిగింది. దీనిలో భాగంగా బీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... ఏ ప్రభుత్వం అయిన బీసీ ఓట్లతో గెలిచి అధికారం ఉన్న బీసీలను పట్టించుకోవడంలేదని బి ఆర్ ఎస్ పార్టీ 37% ఉన్న బీసీల రిజర్వేషన్ను 27% చేసిందని దీనిని 50 శాతం చేయాలని డిమాండ్. బీసీ కుల గణన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని, బీసీ విద్యార్థుల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించాలని, బిసి ఉద్యోగుల రిజర్వేషన్ సౌకర్యం వెంటనే కల్పించాలని. కేంద్ర రాష్ట్ర బీసీ సబ్ ప్లాన్ ఇంటర్ ఏర్పాటు చేయాలని, అద్దె భవనంలో ఉన్న బీసీ గురుకులాలకు పర్మినెంట్ భవనాలు ఏర్పాటు చేయాలని, అలాగే బీసీలకు క్రిమిలేయర్ ను ఎత్తివేయాలని మరియు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బీసీ విద్యార్థిని స్కూల్ కళాశాల స్థాయిలో హాస్టల్లో మిస్ చార్జీలు పెంచాలని, పార్టీలు ఏదైనా బీసీ అభ్యర్థికి బిసి సంక్షేమ తరపున మద్దతు ప్రకటించాలని ఏకగ్రీవంగా దీన్ని తీర్మానం చేస్తున్నామని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని బీసీలు ఐక్యంగా ఉంటే సాధించలేని ఏం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు, బొమ్మల శంకర్ శ్రీకాంత్ అధ్యక్షులు అధ్యక్షులు మాచర్ల సదానందం, బాలి అజయ్, బింగి వెంకటేష్ శ్రీనివాస్, బీసీ నాయకులు బొమ్మల శంకర్, కృష్ణమూర్తి, భూమేశ్వర్, సురేష్, ఆనంద్, వరదరాజు, నరసింహారావు బిసి సంక్షేమ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ కేసు పెట్టడం అన్యాయం -కాంగ్రెస్ పార్టీ



మెట్ పల్లి మార్చి 21 (ప్రజామంటలు): మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంపీటీసీ తీరుకంటి శంకరయ్య కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.... నిన్న తనపై మా తల్లి మరి కొడుకుపై పెట్టిన ఎస్సీ ఎస్టీ కేసు పెట్టడం అన్యాయమని తాము ఎవరిని ఏమీ అనలేమని తాము దళిత పక్షపాతిక ఉంటున్న విషయం అందరికి తెలుసు అని అన్నారు. నా మీద కేసు పెట్టిన రంజిత్ గతంలో ఐదు సార్లు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు వేరే పై కేసులు చేశారని. అకారణంగా తనపై కేసు నమోదు చేసిన రంజిత్ వారి తండ్రి ఊర్లో అందరితో గొడవ పడే వారిని 70 సంవత్సరాల మా తల్లివారిని కొట్టిందని కేసు పెట్టడం ఎంత అన్యాయమని దీని దళితులు అర్థం చేసుకోవాలని మీ విలువలను మీరు కాపాడుకోనలన్నీ వారు చేస్తున్న పనికి మీరు ఖండించాలని ఎమ్మెల్యే తండ్రి గతంలో తనపై కేసులు పెట్టారని ఇప్పుడు కొడుకు ఎమ్మెల్యే హోదాలు ఉండి ఆరోపణ చేయడం ఆయన అవివేకానికి అర్థమని నాపై కేసు పెట్టిన రంజిత్ కి మిషన్ భగీరథఉద్యోగం ఇప్పించానని అటువంటిది వారిని నేను దూషించడం ఎలా జరుగుతుందని గుడి పైసల ఎవరు తీసుకోరని గుడి పైసలపై ఆరోపణ చేయడం అన్యాయం అని ఇటువంటి వాటికి ఎమ్మెల్యే మద్దతు ఇవ్వడం ప్రజలు గమనిస్తున్నారని దళితులు ఎవరు వీరి మాటలు నమ్మవద్దని తనకు గురించి తెలుసుకొని అవగాహన చేసుకోవాలని అందరితో మంచి భావనతో ఉండే వ్యక్తిగా పేరు ఉందని అన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజా పాలన గత కెసిఆర్ పాలన రజకల పాలన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తెలుగంటి శంకరయ్య, బైరి సురేష్, మెరుగు విలాస్ గౌడ్, కొమ్ముల గంగారెడ్డి, చీపురు రమేష్ రెడ్డి, మిట్టపల్లి నారాయణరెడ్డి, సురుకుంట్ల హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

# 2 లక్షల రూపాయల పంట రుణమాఫీ వేంటనే అమలు చేయలి

**పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల తక్షణమే సహాయం అందించాలి**

**బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ**



జగిత్యాల మార్చ్ 21 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో బిసి సంక్షేమ సంఘం సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని, 2 లక్షల రూపాయల రుణమాఫీ ఎందుకు అమలు చేయాలేదని ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాలో పంట నష్టపోయిన పొలాలను పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని, ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల తక్షణమే సహాయం అందించాలని జగిత్యాల బీసీ సంఘం డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున సాయం అందించాలని, కౌలు రైతులకు సైతం సాయం అందించాల్సిందేనని, రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఎన్నికల పేరుతో ఆపే ప్రయత్నం చేయొద్దని ఎన్నికల కమిషన్? అనుమతి తీసుకుని సాయం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గం అధ్యక్షులు తిరుపురం రాంచందర్, బిసి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి, రాష్ట్ర యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్ మరియు బి.సి నాయకులు తిరుపురం శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వికాస తరంగిణి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు

ఎల్కతుర్తి మార్చి 21 (ప్రజా మంటలు) : పశు వైద్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం శిబిరాలు వైద్య శిబిరాల ఏర్పాటుతో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం జిలుగుల గ్రామంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ (జాతీయ సేవా పథకం), పశు వైద్య శిబిరం ఆధ్వర్యంలో జిలుగుల జగన్నాధ పూర్ గ్రామంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారుగా 400 పశువులకు గర్భకోశ, గాలికుంటు, చూడి, సంబంధిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వలన రైతులు చాలా వర్షం వ్యక్తం చేస్తున్నారు ఇలాంటి వైద్య శిబిరా కార్యక్రమాలు ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించినట్లయితే గ్రామీణ ప్రాంతాలలో పశువులకు సక్రమించేటటువంటి వ్యాధులను అరికట్టవచ్చని వీటి వలన రైతులు కూడా ఎంతో లాభదాయకంగా రైతులకు ఖర్చులు తగ్గించుకునే అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు

కార్యక్రమంలో సహాయ సంచాలకులు, డాక్టర్ శ్రీనివాస్ ,వికాస తరంగిణి బిసభ్యులు ,సుభాష్ రెడ్డి, పశు వైద్య కళాశాల అధ్యాపక బృందం సభ్యులు ఉషారాణి, సురేష్, విజయలక్ష్మి, ఆనంద్, అమృత, సంపత్, వంశీకృష్ణ, శ్రీను, రమ్య ,విజయ, భాస్కర్, రాజశ్రీ, అనూష ,ప్రీతి ,రమేష్, తేజ, పశువైద్యా దికారులు దీపిక ,రాజేష్ ,సిబ్బంది వనజ రాణి ,వేణుగోపాల్, కనకయ్య, 39 మంది యూనివర్సిటీ విద్యార్థులు జిలుగుల జగన్నాథ్ పూర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



**జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ గా వినోద్ కుమార్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసారు.**

# ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్



జగిత్యాల మార్చి 21 (ప్రజామంటలు): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మెట్ పెల్లి పట్టణ, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జగిత్యాల జిల్లా పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ లతో కలిసి జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నరు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి పట్టణ, మండల బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తులతో కలిసి భోజనం చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ఉచిత అన్నదాన వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే**

జగిత్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవములకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థము ఓల్డ్ టిటిడి ధర్మశాలలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన వితరణ కార్యక్రమంలో గురువారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం భక్తులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అన్నదానానికి 10 వేల 016 రూపాయల విరాళాన్ని అందజేశారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా దేవాలయ అన్నదానానికి విరాళాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగన బట్ల దినేష్, నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, జక్కు రవి, రాజేష్, అప్పం తిరుపతి, శ్రవణ్, అశెట్టి శ్రీను, సుముక్ మండల నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారనికై ముఖ్యమంత్రి సమయాన్ని కోరిన బ్రాహ్మణ సమాజం



హైదరాబాద మార్చ్ 21 (ప్రజా మంటలు) : ముఖ్యమంత్రి గత ఎన్నికల సమయంలో కానీ అంతకుముందు జరిగిన జిహెచ్ఎంసి ఎన్నికల సమయంలో కానీ కాంగ్రెస్ పార్టీ వెన్నుదన్నుగా బహిరంగంగానే తెలంగాణ బ్రాహ్మణ జేఏసీ పూర్తి మద్దతును ప్రకటించిందని, ఆ సమయంలో నాటి అధికార పార్టీ నుంచి కానీ ఇతర బ్రాహ్మణ ఆర్గనైజేషన్ నుంచి కానీ ఎంత ఒత్తిడి వచ్చినా కూడా మేము మీ వెంటే నడిచామని, గత విషయాలను దృష్టిలో పెట్టుకొని బ్రాహ్మణులకు న్యాయం చేయాలని తెలంగాణ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డా "యజ్ఞం పవన్ కుమార్ శర్మ ముఖ్యమంత్రికి ఇచ్చిన విజ్ఞాపణలో కోరారు. ఈ విజ్ఞాపన పత్రాన్ని బ్రాహ్మణ సేవా వరదం స్టేట్ కన్వీనర్ శ్రీమతి రజిని రావు ముఖ్యమంత్రికి అందజేసి తమ బృందం కలవడానికి సమయం కోరారు. ఈ విజ్ఞాపణలో ఇంకా ఇలా తెలిపారు. గతంలో ఈడబ్ల్యూఎస్ కోసం మేము ధర్నాచౌక్లో దీక్ష చేసిన సమయంలో కూడా మీరు బహిరంగంగానే మాకు మద్దతు ప్రకటించి తోడుగా నిలిచారు. గతంలో ఎలక్షన్ల ప్రచార సమయంలో కూడా మేము మీ ప్రచార రథంలో మీతో పాటు ఉండి కాంగ్రెస్ పార్టీ కోసం ప్రచారం కూడా నిర్వహించాము ఆ సమయంలోనే మీరు బ్రాహ్మణుల దీవెనలు లేనిది ఎవరు ఏమి సాధించలేరు అని మీరు అన్న మాట మాకు ఎప్పటికీ స్ఫూర్తిని ఇస్తుంది. మా ప్రభుత్వం వస్తే గనుక బ్రాహ్మణుల భవిష్యత్తు ఇప్పటికంటే బంగారుమయం చేస్తాము అని మీరు ఆరోజు ఇచ్చిన భరోసా మాకు నేటికీ గుర్తుంది.

అనాడు తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీకి స్వచ్ఛంద సేవలు అందిస్తున్న డాక్టర్గా నాపైన పోలీసు కాల్పులు జరిగిన సమయంలో కూడా మీరు మాకు అండగా నిలిచారు. గతంలో మీతో ఉన్న పరిచయము చనువు మీతో ఉన్న అనుబంధం తో పాటు మీకు బ్రాహ్మణుల యెడల ఉన్నటువంటి గౌరవ భక్తి ప్రపత్తులను ఆధారంగా చేసుకుని మీకు నేటి బ్రాహ్మణసమాజం పరిస్థితిని ఈ వినతి పత్రం ద్వారా విన్నవిస్తున్నాం. ఈరోజు మన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమం కోసం ప్రస్తుతం ఉన్న తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ని తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్గా మార్చాలని కోరడానికి దానితో పాటు గతంలో ఎంతో మంది విదేశీ విద్యా పథకం ద్వారా విదేశాలకు వెళ్లిన విద్యార్థులు అక్కడే ఇరుక్కుపోయి ఇక్కడ తల్లిదండ్రులు అప్పులపాలైన పరిస్థితి వల్ల మరియు బెస్ట్ స్కీం ద్వారా చిన్నచిన్న వ్యాపారానికి అప్లై చేసుకున్న బ్రాహ్మణులకు లోన్లు రాకపోవడం వల్ల వారందరి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఆ పరిస్థితిని మీకు వివరించడానికి దానికి తగ్గట్లుగా నిధులు మీరు ప్రస్తుతం ఉన్న బ్రహ్మణ సంక్షేమ పరిషత్కు వెనువెంటనే మంజూరు చేయాలి అని మీతో చర్చించడానికి మీ అపాయింట్మెంట్ కోరడం జరుగుతుంది.

సమాజైకహితాయ బ్రాహ్మణ్యం అన్న పంథాలో కొనసాగుతున్న మా తెలంగాణ బ్రాహ్మణ జేఏసి, మీరు ఇతర కులాలకి కార్పొరేషన్లు ఏర్పాటు చేయడాన్ని చాలా అనందంగా ఆహ్వానిస్తూ మా బ్రాహ్మణ సమస్యలు కూడా తీర్చాల్సిన బాధ్యత మీ పైన ఉంది కాబట్టి ఒకసారి మా తెలంగాణ బ్రాహ్మణ జేఏసీ తో పాటు ఇతర బ్రాహ్మణ సంఘాల ముఖ్య నాయకులము అందరం మిమ్మల్ని కలవదలుచుకున్నాము. మీరు మీ విలువైన సమయాన్ని కేటాయించి మా ప్రస్తుత పరిస్థితులను వివరంగా తెలుసుకుని గతంలో మీరు భరోసా ఇచ్చిన విధంగా యావత్తు తెలంగాణ బ్రాహ్మణ జాతికి సరైన న్యాయం చేకూర్చడానికి మీరు ముందుకు రావాలని, ప్రత్యక్షంగా కలవడానికి అపాయింట్మెంట్ ఇవ్వవలసిందిగా వీరు కోరారు డా "యజ్ఞం పవన్ కుమార్ శర్మ తెలంగాణ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర చైర్మన్, నారాయణ చక్రవర్తుల శర్మ శ్రీవిద్యా శక్తిపీఠం వ్యవస్థాపకులు, శ్రీమతి రజిని రావు బ్రాహ్మణ సేవా వరదం స్టేట్ కన్వీనర్, వుప్పల బాలసుబ్రమణ్య శర్మ, తెలంగాణ వైదిక స్మార్త సంఘం, స్టేట్ జనరల్ సెక్రటరీ, సిరిసిల్ల రాజేందర్ శర్మ, సీనియర్ జర్నలిస్ట్, గూడ రాజేశ్వరరావు,తెలంగాణ బ్రాహ్మణ అభివృద్ధి సంస్థ, రాష్ట్ర అధ్యక్షులు, మహేష్ శర్మ, నార్త్ ఇండియన్ బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుల యో ఒక బృందం త్వరలో ముఖ్యమంత్రిని కలవనున్నట్లు తెలిపారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటి చెపుతున్న పోచమ్మ బోనాలు



జగిత్యాల మార్చ్ 21 (ప్రజామంటలు): జగిత్యాల రూరల్ మండలము లోని నర్సింగాపూర్, వంజరిపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల సందర్భంగా వేలాది సంఖ్యలో సామూహిక బోనాల ఊరేగింపులో మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్న జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. పోచమ్మ తల్లి కృప కటాక్షము అందరిపై ఎల్లపుడు ఉండాలని జగిత్యాల జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై సౌత్ నుంచి తమిళిసై పోటీ

చెన్నై,మార్చి21(ప్రజా మంటలు):




లోక్‌సభ ఎన్నికల కోసం తమిళనాడులో తొమ్మిది మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితాను బీజేపీ గురువారం విడుదల చేసింది. తమిళనాడు బీజేపీ చీఫ్ కె.అన్నామలై కోయంబత్తూరు నుంచి, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెన్నై (సౌత్), కేంద్రమంత్రి ఎల్.మురుగన్ నీలగిరి నుంచి, నైనార్ నాగేంద్రన్ తిరునల్వేలి నుంచి పోటీ చేయనున్నారు. ఈ జాబితాలో రాధాకృష్ణన్, టీఆర్ పరివేందర్, నరసింహన్, ఏసీ షణ్ముగం కూడా ఉన్నారు. ఇక రాధాకృష్ణన్ కన్యాకుమారి నుంచి, నాగేంద్రన్ తూత్తుకుడి నుంచి, టీఆర్ పరివేందర్ పెరంబలూర్ నుంచి, కృష్ణగిరి నుంచి సి. నరసింహన్ పోటీ చేయనున్నారు. వెల్లూరు బరిలో ఏసీ షణ్ముగం ఉన్నారు. ఇటీవలే తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్ పదవికి రాజీనామా చేసిన అనంతరం తమిళిసై సౌందర రాజన్ సొంత గూటికి చేరుకున్నారు. ముందుగా అనుకున్నట్లే చెన్నై సౌత్ నుంచి ఆమె లోక్ సభ ఎన్నికల బరిలో ఉండనున్నారు.

## రజాకార్ సినిమా నిర్మాతకు బెదిరింపులు

### సీఆర్పీఎఫ్ భద్రత కల్పించిన కేంద్రం

హైదరాబాద్,మార్చి21 (ప్రజా మంటలు):




రజాకార్ సినిమా నిర్మాతకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీనిపై ఆయన పోలీసులతో పాటుగా కేంద్ర హోంశాఖకు కూడా ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కేంద్రం నిఘా వర్గాల ద్వారా దర్యాప్తు జరిపి ఆయనకు భద్రతను కల్పిస్తున్నట్లు వెల్లడించింది. పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా ప్రస్తుతం థియేటర్స్ లో సందడి చేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదలకు ముందే సంచలనంగా మారిన సినిమా రజాకార్. ఈ చిత్రం మార్చి 15న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాను బేజీపీ నేత, సినిమా నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు.అయితే ఈ చిత్రాన్ని నిలుపుదలచేయాలని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిర్మాత నారాయణ రెడ్డికి బెదిరింపు కాల్స్ చేశారు. తనకు దాదాపు 1,100 బెదిరింపు కాల్స్ వచ్చినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆయన కేంద్ర హోంశాఖకు కూడా ఫిర్యాదు చేశారు. నారాయణ రెడ్డి ఫిర్యాదుపై వెంటనే కేంద్రం స్పందించింది. ఆయనకు 1o1 సీఆర్పీఎఫ్ భద్రతను కల్పిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. నిఘా వర్గాల ద్వారా తమకు అందిన సమాచారం మేరకు నారాయణ రెడ్డికి 1o1 సీఆర్పీఎఫ్ భద్రతను కల్పిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ విముక్తి పోరాటం నేపథ్యంలో దర్శకుడు యాటా సత్యనారాయణ రజాకార్ చిత్రాన్ని తెంకెక్కించారు. నిజాం కాలంలో హైదరాబాద్ లో జరిగిన దారుణ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కించాడు.ఈ సినిమాలో ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ కీలక పాత్రలో పోషించారు. ఈమెతో పాటుగా బాబీ సింహా, వేదిక, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే, అనుష్యా త్రిపాఠి కీలక పాత్రలు పోషించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ చిత్రం విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల దృష్ట్యా విడుదల కాలేక పోయింది. దీంతో ఈ సినిమాను మార్చి 15న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. ఈ సినిమా విడుదలకు ముందే దీన్ని విడుదల ఆపాలని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## ఉక్రెయిన్ రాజధానిపై రష్యా మిస్సైల్ దాడులు

### నివాస భవనాలు, పారిశ్రామిక సౌకర్యాల ధ్వంసం

### క్షిపణులను కూల్చివేసినట్లు సైనిక అధికారులు వెల్లడి

కివ్,మార్చి21 (ప్రజా మంటలు):



ఉక్రెయిన్ రాజధాని కివ్‌పై రష్యా మిస్సైల్ దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో కనీసం 13 మంది గాయపడ్డారు. నివాస భవనాలు, పారిశ్రామిక సౌకర్యాలను ధ్వంసం చేశారు. కాగా అన్ని క్షిపణులను కూల్చివేసినట్లు సైనిక అధికారులు చెప్పారు. గురువారం తెల్లవారుజామున జరిగిన దాడి ఇటీవలి వారాల్లో బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో నగరాన్ని లక్ష్యంగా చేసుకున్న మొదటి భారీ దాడి అని దాని సైనిక పరిపాలన అధిపతి సెర్హి పాప్కో తెలిపారు. “44 రోజుల విరామం తర్వాత, శత్రువు కివ్‌పై మరో క్షిపణి దాడిని ప్రారంభించింది,” అని పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా కనీసం 13 మంది గాయపడ్డారని కివ్ మేయర్ విటాలి క్లిట్ష్కో తెలిపారు. ఉక్రెయిన్ వైమానిక రక్షణ రాజధానిని లక్ష్యంగా చేసుకున్న 31 రష్యన్ క్షిపణులను కూల్చివేసినట్లు వైమానిక దళ కమాండర్ చెప్పారు. రష్యా సైన్యం వ్యూహాత్మక బాంబర్లను ఉపయోగించిందని, పొరుగు ప్రాంతాలలో సంక్లిష్టమైన విన్యాసాలను అనుసరిస్తూ తన భూభాగం నుండి కొన్ని క్షిపణులను ప్రయోగించిందని, క్షిపణులు వివిధ దిశల నుండి నగరాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని పాప్కో చెప్పారు. దాదాపు మూడు గంటల పాటు ఎయిర్ అలర్ట్‌లు కొనసాగాయి. క్షిపణి శిథిలాలు అనేక నివాస భవనాలు, పారిశ్రామిక ప్రదేశాలు, కిండర్ గార్టెన్‌లను తాకినట్లు క్లిట్ష్కో చెప్పారు. సెంట్రల్ డిస్ట్రిక్ట్ షెవ్‌చెంకివ్‌స్కీలోని బహుళ అంతస్తుల భవనంలోని అపార్ట్‌మెంట్‌లలో ఒకదానిలో మంటలు చెలరేగడంతో నివాసితులు ఖాళీ చేశారు. ఈ దాడిలో సమీపంలోని పలు ఇళ్లలో అద్దాలు పగిలిపోయి, ప్రైవేట్ కార్లు తగలబడిపోయాయని పాప్కో తెలిపారు.కివ్‌కు సహాయం చేయడానికి “రాజకీయ సంకల్పం” చూపించాలని ఉక్రేనియన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ పాశ్చాత్య దేశాలకు పిలుపునిచ్చారు.

## అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వలేం

### అరవింద్ కేజ్రీవాల్‌కు షాకిచ్చిన హైకోర్టు

న్యూఢిల్లీ,మార్చి21 (ప్రజా మంటలు):

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, సీఎం కేజ్రీవాల్ కు మరో షాక్ తగిలింది. ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్ కు షాక్ ఇచ్చింది. లిక్కర్ స్కామ్ కేసులో తనని అరెస్ట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాయి. అయితే ఈ కేసులో తనని అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వలేమని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రస్తుతం కేసు పురోగతి దృష్ట్యా తాము ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో విచారణ నిమిత్తం శుక్రవారం విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని కేజ్రీవాల్ కు ఈడీ గతంలో సమన్లు జారీ చేసింది. అయితే ఈ కేసులో భాగంగా తనని తప్పనిసరిగా ఈడీ అధికారుల అరెస్ట్ చేస్తారని భావించి.. గురువారం ఉదయం హుటాహుటిని ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను ఈడీ విచారణకు సిద్ధంగా ఉన్నానని, ఈడీ తనని అరెస్ట్ చేయకుండా, ఎటువంటి చర్యలకు పాల్పడకుండా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఆయన తన పిటిషన్ లో పేర్కొన్నారు.జ్రీవాల్ పిటిషన్ ను విచారించిన ధర్మాసనంకు ఇరువురు వాదనలు వినిపించారు. వీటిని విన్న ధర్మాసనం కేజ్రీవాల్ కు అరెస్ట్ నుంచి మినహాయింపు ఇవ్వడానికి నిరాకరించింది. కేజ్రీవాల్ అభ్యర్థనపై ఈడీ వివరణ కోరింది. అనంతరం ఈ కేసు విచారణను వాయిదా వేసింది. సమన్లను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ తో పాటుగా దీన్ని కూడా ఏప్రిల్ 22న విచారిస్తామని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. ఇప్పటి వరకు లిక్కర్ పాలసీ కేసులో ఈడీ అధికారులు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కు తొమ్మిది సార్లు సమన్లు జారీ చేశాయి. అయినా సరే కేజ్రీవాల్ ఒక్కసారి కూడా ఈడీ విచారణకు హాజరుకాలేదు. దీంతో తమ సమన్లు కేజ్రీవాల్ ఉల్లంఘించారంటూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే కేజ్రీవాల్ ఈ కేసులో బెయిల్ దక్కించుకున్నారు.

## ఈసీకి ఎలక్టోరల్ బాండ్ల నంబర్లను అందించిన ఎస్బీఐ

### వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్న ఈసీ

న్యూఢిల్లీ,మార్చి21(ప్రజా మంటలు):




ఎలక్టోలర్ బాండ్స్ విషయంలో భారతీయ స్టేట్ బ్యాంక్ కీలక ముందడుగు వేసింది. ఎలక్టోరల్ బాండ్ల పూర్తి డేటాను ఎస్బీఐ గురువారం ఎన్నికల సంఘానికి అందించింది. ఎలక్టోరల్ బాండ్ల నెంబర్స్ ను గతంలో ఈసీకి ఎస్బీఐ అందించలేదు. దీంతో సుప్రీంకోర్టు ఎస్బీఐపై సీరియస్ అయి.. మార్చి 21వ తేదీలోగా నెంబర్లతో సహా పూర్తి వివరాలు అందించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈసీకీ ఎస్బీఐ లక్టోరల్ బాండ్ల నెంబర్లను అందించింది. ఎస్బీఐ అందించిన ఈ డేటా ద్వారా.. ఏ దాత ఏ రాజకీయ పార్టీకి ఎంతెంత విరాళాలు అందించారో పూర్తి వివరాలు త్వరలోనే బయటకు వస్తాయి. అయితే బ్యాంకు అందించిన వివరాలను ఎన్నికల సంఘం త్వరలోనే ఈసీ వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయనుంది. ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఎన్నికల కమిషన్ కు అందజేసినట్లు ఎస్బీఐ గురువారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. తాజాగా ఎస్బీఐ అందించిన డేటాలో %ఖ=చీ% నంబర్, జర్నల్ తేదీ, కొనుగోలు చేసిన తేదీ, గడువు తేదీ, కొనుగోలుదారు పేరు, బాండ్ నంబర్, డినామినేషన్‌లు, ఇష్యూ బ్రాంచ్ కోడ్, స్థితితో సహా ఎలక్టోరల్ బాండ్‌లను కొనుగోలు చేసిన వారి వివరాలు కూడా ఉన్నాయి. ఎస్బీఐ ఇప్పటి వరకు రెండు జాబితాలను ఈసీకి అందించింది. ఎస్బీఐ అందించిన ఈ డేటాను ఎన్నికల సంఘం మార్చి 14న తన వెబ్ సైట్ లో పొందుపరిచింది. ఎస్బీఐ ఈసీకి అందజేసిన మొదటి డేటాలో దాతల పేర్లు, బాండ్ల పేర్లు, వాటిని కొనుగోలు చేసిన తేదీలు ఉన్నాయి. అయితే ఆ డేటాలో యూనిక్ నెంబర్ లేకపోవడంతో ఆ డేటాను కూడా ఈసీకి అందించాలని సుప్రీంకోర్టు ఎస్బీఐకి ఆదేశించింది. దీనిపై రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఎస్బీఐకి మార్చి 21వ సాయంత్రం 5 గంటలులోగా ఎలక్టోరల్ బాండ్ల నెంబర్లను అందించాలని పేర్కొంది. దీంతో ఎస్బీఐ పూర్తి సమాచారాన్ని ఈసీకి అందించింది.

## ఆపరేషన్ గరుడ..

### విశాఖ సీపోర్ట్‌లో 25వేల కేజీల డ్రగ్స్ స్వాధీనం

### షిప్పింగ్ కంటైనర్ లో తరలిస్తున్న వైనం



విశాఖ,మార్చి21 (ప్రజా మంటలు):

ఆపరేషన్ గరుడ’లో భాగంగా డ్రై ఈస్ట్‌తో మిక్స్ చేసిన దాదాపు 25వేల కేజీల డ్రగ్స్‌ను సీబీఐ స్వాధీనం చేసుకుంది. డ్రగ్స్‌ను కలిగి ఉన్న షిప్పింగ్ కంటైనర్‌ను అదుపులోకి తీసుకుని.. మొత్తం సరుకును సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. “ఆపరేషన్ గరుడ”లో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో వ్యవస్థీకృత డ్రగ్స్ కార్టెల్స్‌పై పోరాటంలో భాగంగా ఇంటర్‌పోల్ ద్వారా అందిన సమాచారంతో విశాఖ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ సహాయంతో విశాఖపట్నం ఓడరేవులోని షిప్పింగ్ కంటైనర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది. ఈ కంటైనర్‌ను భారతదేశంలోని విశాఖపట్నంలో డెలివరీ చేయడానికి “శాంటోస్ పోర్ట్, బ్రెజిల్” నుండి విశాఖపట్నం ఆధారిత ప్రైవేట్ కంపెనీ అయిన కన్సిగ్నీ పేరుతో బుక్ చేయబడింది. కంటైనర్‌లో 25,000 వేల కిలోల డ్రగ్స్ ఉన్నట్లు తెలిసింది. బ్రెజిల్ నుంచి విశాఖ తీరానికి ఈ కంటైనర్ వచ్చింది.అయితే, ప్రాథమిక పరీక్షలో, నార్కోటిక్స్ పదార్థాలను గుర్తించే యంత్రాంగాల ద్వారా, రవాణా చేయబడిన మెటీరియల్‌లో ఇన్‌యాక్టివ్ డ్రైడ్ ఈస్ట్‌తో కలిపిన నార్కోటిక్ డ్రగ్స్ ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం సరుకును స్వాధీనం చేసుకున్నారు. అడ్రస్ ఆధారంగా సీబీఐ కేసు నమోదు చేసింది. సాధారణంగా కట్టింగ్ ఏజెంట్లు అని పిలువబడే ఇతర పదార్థాలతో కలపడం ద్వారా మాదక ద్రవ్యాలను దిగుమతి చేసుకోవడంలో అంతర్జాతీయ నేర నెట్‌వర్క్ ప్రమేయాన్ని ఆపరేషన్ సూచిస్తుంది. గతంలో కూడా, ఇంటర్‌పోల్ ఇన్‌పుట్‌ల ఆధారంగా అంతర్జాతీయ స్థాయిలో మాదకద్రవ్యాల మహమ్మారిని ఎదుర్కోవడంలో తన నిబద్ధతను కొనసాగించడానికి సీబీఐ ఎన్‌డీపీఎస్ చట్టం కింద కార్యకలాపాలు నిర్వహించింది. నేరాలను నమోదు చేసింది. ఈ విషయంలో తదుపరి విచారణ కొనసాగుతోంది.

## భారత్ నుంచి జవాబుదారీతనం ఆశిస్తున్నాం

### ఖలిస్తాన్ ఉగ్రవాది హత్యకుట్రపై అమెరికా

న్యూఢిల్లీ,మార్చి21 (ప్రజా మంటలు):




ఖలిస్తాన్ ఉగ్రవాది, సిఖ్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) సంస్థ చీఫ్ గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నాడనే ఆరోపణలతో భారత జాతీయుడు నిఖిల్ గుప్తాను చెక్ రిపబ్లిక్ అరెస్ట్ చేసింది. అమెరికా అధికారుల సూచన మేరకు గతేడాది నవంబర్‌లో అతడిని అదుపులోకి తీసుకుంది. ఇదిలా ఉంటే నిందితుడికి భారత ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అమెరికా గడ్డపై అమెరికన్ సిటిజన్ అయిన గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నడాన్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోంది. ఇప్పటికే ఈ విషయాన్ని అత్యున్నత స్థాయిలో భారత ప్రభుత్వానికి తన ఆందోళన తెలియజేసింది. దీనిపై భారత ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇదిలా ఉంటే హత్యకు కుట్ర పన్నిన వారిని బాధ్యులను చేసేందుకు భారత ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు అమెరికా తెలిపింది. ఈ విషయంలో భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం భారత్ నుంచి జవాబుదారీతనం ఆశిస్తున్నామని పేర్కొంది. అమెరికా-కెనడా ద్వంద్వ పౌరసత్వం కలిగిన పన్నూను హతమార్చేందుకు ఒక హంతకుడికి లక్ష డాలర్లను చెల్లించడానికి నిఖిల్ గుప్తా అంగీకరించాడని అమెరికా ఆరోపిస్తోంది.పన్నూ మర్డర్ కుట్ర భారత్, అమెరికాల మధ్య తీవ్ర సమస్యగా దక్షిణ, మధ్య ఆసియా సహాయ కార్యదర్శి డొనాల్డ్ లూ బుధవారం వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వంలో పనిచేస్తున్న ఒకరి ఆదేశానుసారం భారతీయ పౌరుడు అమెరికన్ పౌరుడిని చంపడానికి ప్రయత్నించినట్లు యూఎస్ న్యాయశాఖ ఆరోపించింది. రష్యాలో అలెక్సీ నావల్నీ హత్యకు సంబంధించి యూఎస్ఏ 500 మందికి పైగా వ్యక్తులపై ఆంక్షలు విధించినట్లే , పన్నూ విషయంలో పరిశీలిస్తున్నారా అని ప్రశ్నించిన సమయంలో లూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియాలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ, ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతు ఇస్తున్న పన్నూను భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడిపై ఇండియాలో అనేక కేసులు నమోదయ్యాయి.

## ఇండియాలో వేగంగా తగ్గిన సంతానోత్పత్తి

### రేటు 6.2 నుంచి 2కి తగ్గిన సంతానోత్పత్తి

### ది లాన్సెట్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి21(ప్రజా మంటలు):



ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో సంతానోత్పత్తి రేటు(ఫర్టిలిటీ రేట్) పడిపోతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు తక్కువ సంతానోత్పత్తి రేటును ఎదుర్కొంటున్నాయి. ఇదిలా ఉంటే ఇండియాలో కూడా సంతానోత్పత్తి రేటు 1950లో దాదాపుగా 6.2 శాతంగా ఉంటే 2021 నాటికి 2కి పడిపోయినట్లు ది లాన్సెట్ అధ్యయనం తెలిపింది. టోటల్ ఫెర్టిలిటీ రేట్(%ఖీ=%) 1950లో ఒక మహిళకు 4.8 కంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉంది. 2021లో ఒక్కో మహిళ 2.2 పిల్లలను మాత్రమే కలిగి ఉంది. ఈ గణాంకాలు 2050, 2100 నాటికి 1.8, 1.6 శాతానికి తగ్గుతాయని అంచనా వేయబడింది. 2021లో ప్రపంచవ్యాప్తంగా 12.9 కోట్ల పిల్లలు జన్మించారు, 1950లో దాదాపుగా 9.3 కోట్ల నుంచి 2016లో 14.2 కోట్ల పిల్లల జననాలకు తగ్గింది. భారతదేశంలో 1950లో 1.6 కోట్ల కంటే ఎక్కువ సజీవ జననాలు జరిగాయి, 2021లో ఇది 2.2 కోట్ల పిల్లల జననాలు జరిగాయి. 2050 నాటికి ఇది 1.3 కోట్లకు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం చాలా దేశాలు సంతానోత్పత్తి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అయితే, తక్కువ-ఆదాయ దేశాల్లో మాత్రం ఇప్పటికీ సంతానోత్పత్తి రేటు అధికంగానే ఉంది. ఈ దేశాలు 21 శతాబ్ధంలో కూడా అధిక ఫెర్టిలిటీ సమస్యలను ఎదుర్కొంటోందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా పశ్చిమ, తూర్పు సబ్ సహారా ఆఫ్రికాలోని కొన్ని దేశాలు ఇది ఎక్కువగా ఉంది. 2021 నుంచి 2100 వరకు ప్రపంచ సజీవ జననాల్లో తక్కువ ఆదాయ దేశాల వాటా 18 శాతం నుంచి 35 శాతానికి రెట్టింపు అవుతుందని, కొన్ని పేద దేశాల్లో ఎక్కువ మంది పిల్లలు పుడుతారని పరిశోధకులు అంచానా వేశారు. మారుతున్న వాతావరణ మార్పులు, అధిక సంతానోత్పత్తి తక్కువ ఆదాయ దేశాలు తరుచుగా వరదలు, కరువులు కారణంగా ఆహారం నీరు కొరత ఎదుర్కొంటుందని హీట్ రిలేటెడ్ వ్యాధులు, మరణాలు పెరుగుతాయని నివేదిక చెప్పింది. సంతానోత్పత్తి అనేది ఆర్థిక వ్యవస్థలు, భౌగోళిక రాజకీయాలు, ఆహార భద్రత, ఆరోగ్యం, పర్యావరణం ఇలా పలు అంశాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని చెప్పింది. ముఖ్యంగా మధ్య- ఉన్నత ఆదాయ దేశాలకు, తక్కువ ఆదాయ దేశాల మధ్య స్పష్టమైన జనాభా విభజనను చూపిస్తుందని నివేదిక పేర్కొంది. వృద్ధాప్య జనాభా సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వాలు నిధులను, ఇతర మార్గాలను గుర్తింకపోతే, ఇది జాతీయ ఆరోగ్య బీమా, సామాజిక భద్రత కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలపై ఎక్కువ ఒత్తిడి తెస్తుందని నివేదిక హెచ్చరించింది. ప్రపంచ జనాభా నిరంతర క్షీణత వనరులు, కర్బణ ఉద్గారాలపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు పర్యావరణ పురోగతికి అవకాశాలు అందించవచ్చు. ఇక తక్కువ ఆదాయదేశాల్లో సంతానోత్పత్తిని తగ్గించడానికి గర్భనిరోధక వెసులుబాటు, విద్య వంటివి సహాయపడుతాయని పరిశోధకులు అంచనా వేశారు. పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (%ూఖీ×%) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రెజా మాట్లాడుతూ.. ఈ పరిశోధన ఇండియాకు తీవ్ర చిక్కులను కలిగి ఉందని, వృద్ధాప్య జనాభా, శ్రామిక శక్తి కొరత వంటి సవాళ్లను ప్రేరేపించవచ్చని హెచ్చరించారు. ఈ సవాళ్లకు భారత్ ఇప్పుడు కొన్ని దశాబ్ధాల దూరంగా ఉన్నప్పటికీ.. ఇప్పటి నుంచే సమగ్రమైన విధానంతో మనం పనిచేయాలని సూచించారు.

## ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలన్నదే లక్ష్యం

### అదే లక్ష్యంతో పనిచేస్తున్నాం: కిషన్ రెడ్డి

హైదరాబాద్,మార్చి21 (ప్రజా మంటలు):




హైదరాబాద్ నగరంలోని బాగ్ అంబర్‌పేట్ డివిజన్ లో కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో లోక్ సభ ఎన్నికలకు నగారా మోగింది అని తెలిపారు. వచ్చే ఎన్నికలు దేశం కోసం జరిగే ఎన్నికలు.. నరేంద్రమోడీకి ఎంత మెజారిటీ వస్తదో నిర్దేశించే ఎన్నికలు.. ప్రస్తుతం దేశంలో భారతీయ జనతా పార్టీకి 302 స్థానాలు ఉన్నాయి.. వచ్చే ఎన్నికల్లో 370 సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు అని ఆయన చెప్పారు. ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.. దేశంలో గతంలో ఎన్నడూ లేని మెజారిటీని దేశ ప్రజలు నరేంద్రమోడీకి కట్టబెట్టపోతున్నారు.. దేశంలో శాంతి భద్రతలు కాపాడటం కోసం.. దేశంలో సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం నరేంద్రమోడీ నాయకత్వంలో నీతివంతమైన ప్రభుత్వం మళ్లీ రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారు అని కిషన్ రెడ్డి అన్నారు.దేశ గౌరవాన్ని పెంచాలంటే.. పేద ప్రజలకు సంక్షేమం అందాలంటే.. దేశంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలంటే మోడీనే మళ్లీ రావాలని 140 కోట్ల మంది ప్రజలు ఆకాంక్షిస్తున్నారు అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రపంచ దేశాల ముందు దేశ గౌరవాన్ని పెంచిన వ్యక్తి నరేంద్రమోడీనే.. నరేంద్ర మోడీ గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఒక్క రోజు సెలవు తీసుకోకుండా దేశం కోసం ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించి 17కు 17 సీట్లు గెలిపించి.. దేశంలో మూడవసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ నాయకత్వంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో భాగస్వామ్యులు చేయాలని కోరుతున్నాను అని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి తెలిపారు.

## అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాభాగమే

### మరోసారి స్పష్టంచేసిన అగ్రరాజ్యం అమెరికా

అరుణాచల్‌ప్రదేశ్,మార్చి21 (ప్రజా మంటలు):



అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారత్‌లోఅంతర్భాభాగమేనని అగ్రరాజ్య అమెరికా మరో సారి స్పష్టం చేసింది. అరుణాచల్‌ను తాము భారత భూభాగంగా గుర్తిస్తున్నామని తెలిపింది. అరుణాల్‌ను దక్షిణ టిబెట్‌గా అభివర్ణిస్తున్న చైనా.. అది తమదేనంటూ ఆ దేశ సైన్యం ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలో అరుణాచల్ భారత్‌లో అంతర్భాగంగా వాషింగ్టన్ గుర్తిస్తున్నదని అమెరికా రక్షణ శాఖ డిప్యూటీ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ వెల్లడించారు. సైన్యం లేదా పౌరులు వాస్తవాధీన రేఖ అవతల ఆక్రమణలకు పాల్పడటానికి ఎలాంటి ప్రయత్నాలు చేసినా తాము దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఇక, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర తమదేనంటూ డ్రాగన్ కంట్రీ చైనా మొండిగా వ్యవహరించి.. తన వక్రబుద్ధిని బయట పెట్టింది. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సేలా సొరంగ మార్గాన్ని ప్రారంభించారు. దీనిపై చైనా రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. జాంగ్నాన్ తమదే, సేలా సొరంగాన్ని భారత్ చట్టవిరుద్ధంగా స్థాపించిందంటూ రక్షణ శాఖ అధికార ప్రతినిధి సీనియర్ కల్నల్ జాంగ్ షియాగాంగ్ గత శుక్రవారం పేర్కొన్నారు. అయితే, దీనిపై భారత్ దేశం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. చైనా ప్రకటన అసంబద్ధమైనది.. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగమే అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా అరుణాచల్ భారత్‌లో అంతర్భాగంగా గుర్తిస్తున్నామని అమెరికా వెల్లడించింది.



# బెంగళూరు అభిమానుల ప్రేమను ఫీల్ అయ్యాం

దాదాపు గత 17 ఏళ్ల నుంచి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు అభిమానులు అందరూ కూడా నిరీక్షణగా ఎదురు చూస్తున్న కల ఇటీవల నెరవేరింది. ఐపీఎల్ లో బెంగళూరు జట్టు టైటిల్ గెలవక పోయినప్పటికీ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో మాత్రం రెండో సీజన్లోనే ఇది సాధ్యమైంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రాయల్ చాలెంజెస్ బెంగళూరు జట్టు అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇకపోతే ఇటీవల అటు ఆర్సిబి అన్ బాక్స్ ఈవెంట్ నిర్వహించగా.. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో టైటిల్ గెలిచిన ఆర్సిబి ఉమెన్స్ జట్టుకి ఘన స్వాగతం పలికింది మెన్స్ టీం. అయితే ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో టైటిల్ గెలిచిన ఆర్సిబి ఇక ఈసారి ఐపీఎల్ లో కూడా ఇది రిపీట్ చేస్తుందని అందరూ అనుకుంటున్నారు. కాగా ఇటీవల ఆర్సిబి అన్ బాక్స్ ఈవెంట్ లో మాట్లాడిన విరాట్ కోహ్లీ.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ కప్ గెలిచినప్పుడు మేము మ్యాచ్ చూస్తూనే ఉన్నాం. అప్పుడు బెంగళూరు అభిమానుల ప్రేమను ఫీల్ అయ్యాం. 11 మంది మాత్రమే కాదు బెంగుళూరు మొత్తం కప్పు గెలిచింది అన్నట్లుగా అందరూ సంబరాలు చేసుకున్నారు. ఇక ఇప్పుడు ఈ సంబరాలను డబుల్ చేసేందుకు మేము సిద్ధమవుతున్నాం అటు విరాట్ కోహ్లీ చెప్పుకొచ్చాడు.గత పదహారేళ్ళలో తాము ఎప్పుడూ ఇక్కడికి వచ్చిన టైటిల్ గెలవాలని దృఢ సంకల్పంతోనే బరిలోకి దిగాం. అందుకోసం ప్రతిసారి కూడా శాయ శక్తుల కృషి చేస్తూనే ఉన్నాం అంటూ కోహ్లీ తెలిపాడు. ఐపీఎల్ టైటిల్ తొలిసారి గెలిచిన ఆర్సిబి జట్టులో ఉండాలన్నది తన కోరిక. అభిమానులు ఫ్రాంచైజీ అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేను. టైటిల్ గెలిచి వీరి రుణాన్ని తీర్చుకుంటా అంటూ విరాట్ కోహ్లీ చెప్పుకొచ్చాడు. ఇకపోతే ప్రస్తుతం అటు ఆర్సిబి జట్టు ఎంతో పటిష్టంగా ఉంది అని చెప్పాలి. దీంతో ఇక ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో మ్యాజిక్ ఐపీఎల్ లో కూడా క్రియేట్ అవుతుందని అభిమానులు అనుకుంటున్నారు.

## చెన్నై సూపర్ కింగ్స్ కొత్త కెప్టెన్ గా రుతురాజ్ గైక్వాడ్



అనుకున్నదే జరిగింది. మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనికి ఇదే ఆఖరి ఐపీఎల్. దాని తగ్గట్టుగానే ఈ సీజన్ మొదలయ్యే ఒక్క రోజు ముందుగా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తన కొత్త కెప్టెన్‌ను ప్రకటించింది. కెప్టెన్సీ బాధ్యతల నుంచి ధోని తప్పుకున్నాడని ఐపీఎల్ 2024లో సీఎస్‌కే సారథ్య పగ్గాలను.. ఆ జట్టు ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ చేపట్టనున్నాడు. తాజాగా ఐపీఎల్ ట్రోఫీతో 10 జట్ల కెప్టెన్లు ఫోటోలు దిగగా.. అందులో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ధోని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ కనిపించాడు. అటు ఐపీఎల్ అధికారిక ట్విట్టర్ కూడా చెన్నై కొత్త రుతురాజ్ అని అఫీషియల్‌గా ప్రకటించింది. మరోవైపు పంజాబ్ కింగ్స్ వైస్ కెప్టెన్ జితేష్ శర్మ అని కూడా వెల్లడించింది.42 ఏళ్ల మహేంద్ర సింగ్ ధోని.. 2008లో ఐపీఎల్ మొదటి సీజన్ దగ్గర నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు కెప్టెన్‌గా కొనసాగుతూ వచ్చాడు. 12సార్లు ప్లేఆఫ్స్, 10సార్లు ఫైనల్స్‌కి ధోని సారథ్యంలోనే సీఎస్‌కే చేరింది. 2022 సీజన్ ప్రారంభంలో రవీంద్ర జడేజాకు చెన్నై పగ్గాలు అప్పగించాడు ధోని.. అయితే ఆ నిర్ణయానికి వ్యతిరేకత రావడంతో సరిగ్గా ఎనిమిది మ్యాచ్‌ల అనంతరం తిరిగి పగ్గాలు చేపట్టాడు మిస్టర్ కూల్. ఇప్పటిదాకా ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను 212 మ్యాచ్‌లకు సారథ్యం వహించి.. 128 విజయాలు అందించాడు ధోని. అలాగే 82 మ్యాచ్‌ల్లో ఓటమి ఎదుర్కుంది సీఎస్‌కే. గత సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్‌లో అద్భుత విజయాన్ని సాధించి చెన్నైకి ఐదో ఐపీఎల్ టైటిల్ అందించాడు ధోని. దానితో చెన్నై మొత్తంగా టీ20 టోర్నమెంట్లలో ఏడు ట్రోఫీలు అందుకుంది. కాగా, ఆగష్టు 15, 2020లో ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ధోని సారథ్యంలోనే 2007లో టీ20 వరల్డ్‌కప్, 2011లో వన్డే ప్రపంచకప్, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుంది టీమిండియా.

## చెపాక్‌లో ధోనికి తిరుగులేదా?



ఇండియన్ ప్రీమియర్ లీగ్సీజన్ 17 ప్రారంభానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. శుక్రవారం (మార్చి 22) నుంచి ప్రారంభమయ్యే ఓపెనింగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. అంటే చెన్నై సూపర్ కింగ్స్ హోమ్ గ్రౌండ్ లో తొలి మ్యాచ్ ఆడడం ప్లస్ పాయింట్ అవుతుంది. ఎందుకంటే ఎంఏ చిదంబరం మైదానంలో సీఎస్‌కే జట్టు కు మంచి రికార్డులున్నాయి. ముఖ్యంగా %జూఖ% ఈ గ్రౌండ్ లో %=జదీ% చేతిలో కేవలం ఒక్క సారి మాత్రమే ఓడిపోయింది. ఎంఏ చిదంబరం స్టేడియంలో ఇరు జట్లు ఇప్పటి వరకు 8 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 7 సార్లు గెలిచింది. %=జదీ% జట్టు ఒకసారి మాత్రమే విజయం సాధించింది. అది కూడా 2008లో. దీని తర్వాత చెన్నైలో %జూఖ%పై %=జదీ% విజయం సాధించలేదు. %జూఖ% జట్టు తమ సొంత మైదానంలో ఇప్పటి వరకు 64 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 18 మ్యాచ్‌ల్లో ఓడి 46 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అందుకే చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు చిదంబరం మైదానం కొట్టిన పిండిలాంటిదంటారు ఫ్యాన్స్. అదే సమయంలో ఆర్‌సిబి జట్టు చెన్నై మైదానంలో మొత్తం 12 మ్యాచ్‌లు ఆడింది. 5 మ్యాచ్‌ల్లో గెలిచి 7 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. అయితే, ఈ ఫీల్డ్‌లో టాస్ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సీఎస్‌కే ఇక్కడ ఎక్కువ మ్యాచ్‌లు గెలవడంలో టాస్ ప్రముఖ పాత్ర పోషించింది. చెన్నైలో ధోనీ సేన గెలిచిన 46 మ్యాచ్‌ల్లో 30 మ్యాచ్‌ల్లో సీఎస్‌కే మొదట బ్యాటింగ్ చేయడం గమనార్హం. కాబట్టి, ఇక్కడ %జూఖ%దే పైచేయి అయినప్పటికీ, టాస్ విన్ అయితే ఆశ్చర్యకరమైన ఫలితాలను ఆశించొచ్చు. కాగా సీఎస్‌కే, ఆర్‌సీబీ మధ్య మ్యాచ్ శుక్రవారం రాత్రి 7.30కు షురూ కానుంది.

## బౌన్సర్ రూల్‌తో సహా ఈ ఐపీఎల్‌లో కొత్త నిబంధనలు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 17 నేటి నుంచి ప్రారంభమవుతుంది. చెన్నై వేదికగా జరగనున్న ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లో ఆర్‌సీబీ జట్టు డిఫెండింగ్ చాంపియన్ సీఎస్‌కేతో తలపడనుంది. ఈ మ్యాచ్‌తో ఐపీఎల్‌లో రెండు కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ నిబంధనలతో అంపైర్లు, బౌలర్లు కాస్త రిలాక్స్ అవుతారు. డెసిషెన్ రివ్యూ సిస్టమ్‌లో లోపాలను సరిచేయడానికి ఈ సంవత్సరం %ఖూా% లో స్మార్ట్ రీప్లే సిస్టమ్ ప్రవేశపెట్టారు. ఎస్ఆర్ఎస్ నిబంధన అమలుతో ఈ ఐపీఎల్‌లో థర్డ్ అంపైర్ నిర్ణయం మరింత కచ్చితం కానుంది. ఎందుకంటే దీని కోసం ఫీల్డ్‌లో మొత్తం 8 హాక్-ఐ కెమెరాలను ఉంచుతారు. వాటి ద్వారా ఫీల్డ్‌లోని అన్ని దృశ్యాలను చిత్రీకరిస్తారు. అలాగే, స్పష్టమైన చిత్రంతో హాక్-ఐ ఉపకరణాల సహాయంతో థర్డ్ అంపైర్ వెంటనే నిర్ణయాన్ని ప్రకటిస్తాడు. స్మార్ట్ రీప్లే సిస్టమ్‌ను ఉపయోగించడంతో, థర్డ్ అంపైర్ వీడియోను విభిన్న కోణాల నుంచి సమీక్షించవచ్చు. హాకీ ఆపరేటర్లు ఇక్కడ స్ప్లిట్ స్క్రీన్‌లను ఉపయోగిస్తారని దీని అర్థం. దీని నుండి, తక్షణ తీర్పు కోసం సంబంధిత సిట్యువేషన్ స్క్రీన్ సహాయం తీసుకోవచ్చు. ఉదాహరణకు, ఒక ఫీల్డర్ బౌండరీ లైన్‌లో క్యాచ్ తీసుకున్నాడనుకుందాం. ఈ సందర్భంలో, ఫీల్డర్ కాలు బౌండరీ లైన్‌ను తాకిందో లేదో తెలుసుకోవడానికి, కాలు భాగం వీడియోను వెంటనే స్ప్లిట్ స్క్రీన్‌లో తనిఖీ చేయవచ్చు. అలాగే, పాదంలో ఏ భాగం బౌండరీ లైన్‌ను తాకింది అనేది కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఐపీఎల్‌లో ఒకే ఓవర్‌లో 2 బౌన్సర్లు విసిరే అవకాశం ఉంటుంది. ఇంతకు ముందు ఒక ఓవర్‌లో 1 బౌన్సర్ మాత్రమే వేసేందుకు అనుమతి ఉండేది. ఇప్పుడు ఒకే ఓవర్‌లో రెండు బౌన్సర్లు వేసేందుకు బౌలర్లకు అనుమతి ఉంది. రెండు బౌన్సర్ల నిబంధనను అమలు చేయడం వల్ల బౌలర్లు మరింత ప్రయోజనం పొందుతారు. గతంలో ఒక ఓవర్‌లో ఒక బౌన్సర్‌ను మాత్రమే అనుమతించేవారు. 2వ బౌన్సర్‌ను అంపైర్ నో బాల్‌గా పరిగణించారు. ఇప్పుడు ఒక ఓవర్‌లో 2 బౌన్సర్లు ఉండటంతో బ్యాటర్లకు దబిడిదిబిడే. ఎందుకంటే గతంలో ఒక బౌన్సర్ ముగిసిన తర్వాత మరో బౌన్సర్ వేయరని బ్యాటర్లకు తెలుసు. కానీ ఈసారి 6 బంతుల్లో 2 బౌన్సర్లు ఉండటంతో బౌలర్లు పరిస్థితిని బట్టి బౌన్సర్‌ను ఉపయోగించుకోవచ్చు. ముఖ్యంగా ఉత్కంఠ భరిత మ్యాచుల్లో ఈ నియమం బౌలర్లకు ప్రయోజనకరంగా ఉంటుంది.ఇదిలా ఉంటే ఇటీవల ఐసీసీ తీసుకొచ్చిన స్టాప్ క్లాక్ రూల్ ను ఐపీఎల్ లో అమలు చేయడం లేదు. ఈ నిబంధన ప్రకారం ఓవర్ పూర్తికాగానే థర్డ్ అంపైర్ టైమర్ ఆన్ చేస్తాడు. 60 సెకన్ల లోపు బౌలింగ్ జట్టు మరొక ఓవర్ ప్రారంభించాలి. ఒకవేళ అలా చేయలేకపోతే ఫీల్డ్ అంపైర్ రెండు సార్లు వార్నింగ్ ఇస్తాడు. అయినా సరే సమయంలోపు ఓవర్ వేయకుంటే ఆఖరికి ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తాడు. టీ20 ప్రపంచకప్ నుంచి ఈ రూల్ అమల్లోకి రావొచ్చు.




## ముంబై జట్టులోకి నయా బుమ్రా

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ ఎడిషన్ ప్రారంభం కానున్న తరుణంలో కొన్ని జట్లలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. గాయం లేదా ఇతర కారణాలతో లీగ్‌కు దూరమైన ఆటగాళ్లను వీలైనంత త్వరగా ఇతరులతో భర్తీ చేయాలని ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. ఇందులో భాగంగా ముంబై ఇండియన్స్ తమ జట్టులోకి కొత్త ఆటగాడిని తీసుకుంది. గాయం కారణంగా ఐపీఎల్ 2024 నుంచి వైదొలిగిన శ్రీలంక పేసర్ దిల్షాన్ మధుశంక స్థానంలో దక్షిణాఫ్రికా పేసర్ క్వేనా మపాకను ముంబై ఇండియన్స్ ఎంపిక చేసింది. ఆశ్చర్యకరంగా అతని వయసు 17 ఏళ్లు మాత్రమే. ఇటీవల జరిగిన %ఖ%-19 ప్రపంచకప్‌లో, మపాక బొంబట్ 6 మ్యాచ్‌ల్లో 21 వికెట్లు పడగొట్టాడు. క్వేనా మపాకా కూడా జస్ప్రీత్ బుమ్రా వంటి అద్భుతమైన యార్కర్ బౌలర్. అలాగే బంతిని మంచి వేగంతో స్వింగ్ చేస్తాడు. మాపాక వయస్సు 17 సంవత్సరాలు. ప్రస్తుతం 12వ తరగతి విద్యార్థి. కానీ అతనికి చాలా ప్రతిభ ఉంది. కాబట్టి ముంబై మొదటి మ్యాచ్‌లోనే మపాక బరిలోకి దిగే అవకాశం ఉంది. గుజరాత్ టైటాన్స్ కూడా మహ్మద్ షమీ స్థానంలో ఫాస్ట్ బౌలర్ సందీప్ వారియర్‌ను ఎంపిక చేసింది. అతను గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకే204ఆర్) తరపున ఆడాడు. 2019లో ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన సందీప్ ఇప్పటివరకు కేవలం 5 మ్యాచ్‌లు మాత్రమే ఆడి 2 వికెట్లు తీశాడు.షమీ పాదాల గాయంతో బాధపడుతున్నాడు. అతను ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ కారణంగా జూన్‌లో జరిగే %ు%20 ప్రపంచ కప్‌లో ఆడలేడు. గుజరాత్ ఫ్రాంచైజీ రూ.50 లక్షలకు సందీప్‌ను తీసుకుంది. ఇక %ఖూా% 2022 మెగా వేలానికి ముందు %ఖఖ=% సందీప్‌ని విడుదల చేసింది.

**ముంబై ఇండియన్స్ జట్టు:**
హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), డెవాల్డ్ బ్రీవిస్, టిమ్ డేవిడ్, తిలక్ వర్మ, అర్జున్ టెండూల్కర్, కుమార్ కార్తికేయ, ఆకాష్ మధ్వల్, నెహాల్ వధేరా, షామ్స్ ములానీ, విష్ణు వినోద్, పీయూష్ చావ్లా, రొమారియో షెపర్డ్, గెరాల్డ్ కోయెట్జీ, దిల్షన్ మధుశంక, శ్రేయాస్ గోపాల్, నువాన్ తుషార, అన్షుల్ కాంబోజ్, నమన్ ధీర్, మహ్మద్ నబీ, శివాలిక్ శర్మ, ల్యూక్ వుడ్.

## ఐపీఎల్ లీగ్ నుంచి తప్పుకోనున్న ఆడం జంపా

ఐపీఎల్ ఆరంభానికి మరికొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. ఈ క్రమంలో ఒక జట్టు తర్వాత ఒక జట్టు షాక్ ల మీద షాక్ లు ఇస్తున్నాయి. ఇప్పటికే సీఎస్కే బౌలర్ మహీష్ పతిరణ గాయం కారణంగా ఐపీఎల్ ఆరంభ మ్యాచ్ లకు దూరం కానుండగా.. తాజాగా రాజస్థాన్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడం జంపా లీగ్ నుంచి తప్పుకొంటున్నట్లు సమాచారం తెలుస్తోంది. వ్యక్తిగత కారణాల వల్ల ఈ ఐపీఎల్ కు దూరం కానున్నాడు. కాగా.. ఈ విషయాన్ని రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీ మేనేజర్ తెలిపారు.ఐపీఎల్-2023 మినీ వేలంలో ఆడం జంపాను రాజస్తాన్ రాయల్స్ రూ. 1.50 కోట్లకు కొనుగోలు చేసింది. గతేడాది అతడు రాజస్తాన్ తరఫున ఆరు మ్యాచ్‌లు ఆడగా 8 వికెట్లు తీశాడు. ఈ క్రమంలో 2024 వేలానికి ముందు రాజస్థాన్ జంపాను రిటైన్ చేసుకుంది. కాగా.. ఇప్పుడు జట్టు నుంచి తప్పుకోవడంతో అభిమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రాజస్థాన్ జట్టులో ఉండే.. టీమిండియా ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ కృష్ణ కూడా ఈ ఎడిషన్ ఆడటం లేదు.నేడు చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. మార్చి 24న రాజస్థాన్ రాయల్స్ లక్నో సూపర్ జెయింట్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్ విభాగంలో.. టీమిండియా దిగ్గజాలు రవిచంద్రన్ అశ్విన్, యజువేంద్ర చహల్ ఉన్నారు. ఈ ఇద్దరు బౌలర్లు ఆ జట్టుకు కలిసొచ్చే అంశం.






## పాక్ మాజీ కెప్టెన్ కన్నుమూత..

అనారోగ్య సమస్యలతో పాకిస్థాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సయీద్ అహ్మద్ (86) కన్నుమూశారు. అహ్మద్ 1958-73 మధ్య పాక్ తరఫున 41 టెస్టులు ఆడారు. అందులో 5 సెంచరీలు, 16 అర్ధ శతకాలతో 2991 పరుగులు చేశారు. అంతేకాకుండా.. అహ్మద్ రైట్ ఆర్మ్ స్పిన్నర్ కాగా.. 22 వికెట్లు కూడా తీశారు. ఇదిలా ఉంటే.. అహ్మద్ చేసిన 5 శతకాలలో మూడు ఇండియాపైనే నమోదు చేశారు. 1958లో వెస్టిండీస్‌తో జరిగిన బ్రిడ్జ్‌టౌన్ టెస్ట్‌లో అహ్మద్ అరంగేట్రం చేశాడు. 1972-73లో మెల్‌బోర్న్ వేదికగా తన చివరి టెస్టు మ్యాచ్ ఆడారు. అహ్మద్ పాకిస్థాన్‌కు ఆరో టెస్టు కెప్టెన్. పాక్ దిగ్గజం హనీఫ్ మహ్మద్ తర్వాత కెప్టెన్సీ బాధ్యతలు 1969లో అహ్మద్ కే దక్కాయి. . తన స్వల్ప కెరీర్‌లో మూడు మ్యాచ్‌ల్లో పాక్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.ఫిట్‌నెస్ విషయంలో క్రికెట్ బోర్డుకు తప్పుడు సమాచారం అందించాడన్న కారణంగా అతని కెరీర్‌కు అర్ధంతంగా ఎండ్ కార్డ్ పడింది. పాక్ దిగ్గజం హనీఫ్ ముహమ్మద్ విండీస్‌పై చారిత్రక ట్రిపుల్ సెంచరీ (337) సాధించిన ఇన్నింగ్స్‌లో అహ్మద్ అతని భాగస్వామిగా ఉన్నాడు. ఇదిలా ఉంటే.. సయీద్ అహ్మద్ సోదరుడు యూనుస్ అహ్మద్ కూడా పాక్ టెస్ట్ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. యూనుస్ పాక్ తరఫున నాలుగు టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. కాగా.. అహ్మద్ మృతిపట్ల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మోసిన్ నక్వీ సంతాపం తెలిపారు. సయీద్ అహ్మద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ముంబై ఇండియన్స్ ఎంత కసితో ఉందో అర్థమవుతోంది: అశ్విన్

హార్దిక్ పాండ్యా నాయకత్వంలో ముంబై ఇండియన్స్ జట్టు ఆరో టైటిల్‌పై కన్నేసిందని టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తెలిపాడు. భారీ మొత్తం వెచ్చించి పాండ్యాను కొనుగోలు చేయడం చూస్తే.. టైటిల్ కోసం ముంబై ఎంతటి కసితో ఉందో అర్థమవుతోందన్నాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధికసార్లు విజేతగా నిలిచిన మొదటి జట్టు ముంబై అన్న విషయం తెలిసిందే. ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబైని గతేడాది చెన్నై సూపర్ కింగ్స్ సమం చేసింది. ఆరోసారి టైటిల్ నెగ్గాలనే లక్ష్యంతో ఈసారి ముంబై బరిలోకి దిగుతోంది. ఆర్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ%ా% 'ముంబై ఇండియన్స్ జట్టు ఆరో టైటిల్‌పై కన్నేసింది. చాలా మంది కెప్టెన్సీ గురించి మాట్లాడుతున్నారు. అక్కని నేను మాత్రం ఆ విషయంపై స్పందించను. భారీ మొత్తం వెచ్చించి హార్దిక్ పాండ్యాను కొనుగోలు చేయడం చూస్తే.. టైటిల్ కోసం ముంబై ఎంతటి కసితో ఉందో అర్థమవుతోంది. ఒకవేళ హార్దిక్ బదులు రషీద్ ఖాన్‌ను తీసుకుంటే.. ఎవరూ ఇంతలా చర్చించరు' అని అన్నాడు.హార్దిక్ పాండ్యా తన ఐపీఎల్ కెరీర్‌ను ముంబై ఇండియన్స్‌తో ప్రారంభించాడు. 2015లో ముంబై తరఫున ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేసి.. మంచి ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. ముంబై తరఫున 7 సీజన్లు ఆడిన హార్దిక్.. 2022 వేలంలో కొత్త ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌లోకి వెళ్లాడు. తన అద్భుత సారథ్యంతో గుజరాత్ జట్టుకు తొలి ప్రయత్నంలోనే టైటిల్ అందించాడు. 2023లో రన్నరప్‌గా నిలిపాడు. ఐపీఎల్ 2024కు ముందు ముంబై జట్టులోకి తిరిగి వచ్చాడు. రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ సీజన్‌లో ముంబైకి కప్ అందించాలని హార్దిక్ చూస్తున్నాడు. ఐపీఎల్ 2024లో ముంబై తన తొలి మ్యాచ్‌లో మార్చి 23న గుజరాత్‌తోనే తలపడనుంది.





## రెండు చిత్రాలను లైన్‌లో పెట్టిన సూర్య

ఈ యేడాది హీరో సూర్య నటించే రెండు చిత్రాలు ప్రేక్షకుల ముందుకురానున్నాయి. వీటిలో ఒకటి 'కంగువ'. చిరుత్తై శివ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం చివరి దశ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఈమూవీని జూన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ తర్వాత సుధా కొంగర దర్శకత్వంలో సూర్య నటించే 43వ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాకు 'పురనానూరు' అనే టైటిల్‌ను ఖరారు చేయగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్నారు.సూర్య - సుధ కొంగర కాంబినేషన్‌లో వచ్చిన 'సూరరైపోట్రు' ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఈ ప్రాజెక్టు మాత్రం కాస్త ఆలస్యంకానుందని హీరో సూర్య అధికారికంగా వెల్లడించారు. అయినప్పటికీ ఈ యేడాది ఆఖరునాటికి ఈ సినిమా థియేటర్లలోకి వస్తుందని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటోంది. అలాగే, హిందీలో కూడా సూర్య నటించే 'కర్ణ' ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలన్న ఆలోచనలో సూర్య ఉన్నారు. కాగా.. 'కంగువ' మూవీ టీజర్‌ను మంగళవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ టీజర్ మంచి స్పందనను రాబట్టుకుంటూ.. సినిమాపై క్రేజ్‌ని పెంచేస్తోంది. సూర్య కెరీర్‌లో మరో వైవిధ్య చిత్రంగా ఈ 'కంగువ' నిలుస్తుందనే ఫీల్‌ని ఈ టీజర్ కలిగిస్తోంది. అందుకు నిదర్శనం.. ఈ టీజర్ విడుదలై రెండు రోజులు అవుతున్నా.. ఇంకా టాప్‌లోనే ట్రెండ్ అవుతుండటం.




## అల్లు అర్జున్‌కు 25 మిలియన్ల ఫ్యాన్స్ ఫాలోయింగ్



స్టార్ హీరో అల్లు అర్జున్‌కు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ మామూలుగా లేదు. 'పుష్ప' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్నారు. సోషల్ మీడియాలోనూ ఈ ఐకాన్ స్టార్‌ను కోట్ల మంది ఫాలో అవుతున్నారు. తాజాగా ఇందులో బన్నీ సరికొత్త రికార్డును సొంతం చేసుకున్నారు. తన ఇన్‌స్టాలో ఫాలోవర్స్ ఏకంగా 25 మిలియన్లకు చేరుకున్నారు. ఇంతమంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న తొలి దక్షిణాది నటుడు అల్లు అర్జున్ కావడం విశేషం. ఆ తర్వాత స్థానంలో విజయ్ దేవరకొండ (21.3 మిలియన్లు), మూడో స్థానంలో రామ్ చరణ్ (20.8) ఉన్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ బన్నీ పోస్ట్ పెట్టారు. 'ఎప్పటికీ కృతజ్ఞతలు'అని రాసుకొచ్చారు. దీంతో అభిమానులు ఖుష్ అవుతున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప2'లో నటిస్తున్నారు. ఘన విజయాన్ని అందుకుని అవార్డులను సొంతం చేసుకున్న 'పుష్ప'కు సీక్వెల్‌గా 'పుష్ప 2'కు తెరకెక్కుతోంది. రష్మిక కథానాయిక. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. దీని షూటింగ్ యాగంటిలో జరుగుతోంది. అక్కడ హీరోహీరోయిన్లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఆగస్టు 15న విడుదల కానుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అల్లు అర్జున్ ఈ సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. 'మొదటి భాగంతో పోలిస్తే ఈ చిత్రంలో పాత్రలు వాటి మధ్య సంఘర్షణ మరింత బలంగా ఉంటుంది. ముఖ్యంగా పుష్పరాజ్, భన్వర్ సింగ్ షెకావత్‌ల క్యారెక్టరైజేషన్, తెరపై వాటి ఎగ్జిక్యూషన్, వారికి ఎదురయ్యే పరిస్థితులు థ్రిల్లింగ్‌గా ఉంటాయి. ఈ సినిమా తర్వాత చాలా ఆసక్తికర ప్రాజెక్టులు వరుసలో ఉన్నాయి' అని పేర్కొన్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com